
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 1 మే 2024

## యువతతో నేడు నారా లోకేష్ ముఖాముఖి

నెల్లూరు(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బుధవారం నెల్లూరులో పర్యటించనున్నారు. యువగళం కార్యక్రమంలో భాగంగా ఆయన నెల్లూరు సిటీలో యువతతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య ఈ కార్యక్రమాన్ని వీఆర్సీ మైదానం వేదికగా జరగనుంది. ఇందుకు సంబంధించి టీడీపీ నేతలు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా, మంగళవారం రాత్రే నెల్లూరుకు చేరుకున్న లోకేష్‌కు టీడీపీ నేతలు బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్ తదితరులు స్వాగతం పలికారు.


లోకేష్‌తో బీద రవిచంద్ర

ప్లీజ్.. మా నాన్నను గెలిపించండి !


ఆత్మకూరులో ఓటరును అభ్యర్థిస్తున్న టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి కుమార్తె కైవల్యారెడ్డి

విజయోస్తు!


కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు గుడ్లూరులో తిలకం దిద్దుతున్న మహిళ

ఓన్లో.. నీ ఓటు నాకే !


మండల కేంద్రమైన జలదంకిలో ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ప్రచారం

# ఊరూరా ప్రచార హోరు!

**ఇంటింటా ఓట్ల కోసం వేట! • అభ్యర్థులకు పోటీగా బంధుగణం ప్రచారం • గ్రామాల్లో సందడే సందడి**

అంకుల్.. మా నాన్నను గెలిపించండి!
మీ ఓటు నాకే.. మరచిపోకండి!
మా అత్తమ్మకు ఓటేయరా ప్లీజ్!

ఇలా జిల్లాలో అభ్యర్థులు, వారి బంధువులు ప్రచారాన్ని హోరెత్తించారు. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో బరిలో నిలిచిన అభ్యర్థులు మంగళవారం నుంచి పూర్తి స్థాయిలో ప్రచారాల్లో మునిగిపోయారు. అధికార, ప్రతిపక్ష పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ప్రతి వీధిని కలియతిరుగుతూ ఓటును అభ్యర్థించారు. గత నెల రోజులకుపైగా ప్రచారాలు జరుగుతున్నప్పటికీ ప్రస్తుతం ప్రచారాల్లో ఊపు కనిపిస్తోంది. అభ్యర్థులకు పోటీగా వారి బంధుగణం కూడా ప్రచారాల్లో పాల్గొంటోంది. అన్నా చెల్లెళ్లు, కొడుకులు, కుమార్తెలు, కోడళ్లు, అల్లుళ్లు ఇలా కుటుంబ సభ్యులు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటును అభ్యర్థిస్తున్నారు. టీడీపీలో మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందజేసి తమను గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థులు ప్రజలను కోరుతున్నారు. ఇక వైసీపీ అభ్యర్థులు కేవలం సంక్షేమ పథకాలను మాత్రమే వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తల రాకపోకలు, డప్పులు, బాణసంచా పేలుళ్లు, యువకుల కేరింతలతో గ్రామాల్లో సందడి నెలకొంది.

**• ఊరూరా చుట్టేసిన అభ్యర్థులు**

నెల్లూరు సిటీలో టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ మూడో డివిజన్లో డోర్ టు డోర్ ప్రచారాన్ని నిర్వహించగా, వైసీపీ అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మద్ 54వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. నెల్లూరు రూరల్‌లో టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆమంచర్ల, దొంతాలి గ్రామాల్లో పర్యటించగా, వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి 19వ డివిజన్‌లో ప్రచారం చేశారు. కందుకూరులో టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు గుడ్లూరు మండలం శాలిపేట గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ కందుకూరులో ప్రచారం చేశారు. ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ జలదంకి మండలం చింతలపాలెం, గట్టుపల్లి రామవరప్పాడు గ్రామాల్లో పర్యటించగా వైసీపీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి కూడా అదే మండలంలోని చోడవరంలో ప్రచారం నిర్వహించారు. కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి బోగోలు మండలం ముంగమూరు, ఏనుగుల బావి, తాళ్లూరు గ్రామాల్లో పర్యటించారు. వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలిలోని 10, 11 వార్డులలో ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డితో కలిసి ప్రచారం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముత్తుకూరు మండలం ఈపూరు, పంటపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్ రెడ్డి పొదలకూరు మండలంలోని మహ్మదాపురం, తాటిపర్తి గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. కోవూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కొడవలూరు మండలం ఆలూరుపాడు, మానేగుంట గ్రామాల్లో పర్యటించగా, వైసీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విడవలూరు మండలం పార్లపల్లి, అన్నారెడ్డిపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి చేజర్ల మండలం నడిగడ్డ అగ్రహారం, మాముడూరు గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఎన్నిల ప్రచారం నిర్వహించారు. వైసీపీ అభ్యర్థి విక్రమ్‌రెడ్డి మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లి, డీసీపల్లి గ్రామాల్లో పర్యటించారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

న్యాయం మీరే చేయాలా!


నెల్లూరులో న్యాయవాదులతో సమావేశమైన నెల్లూరు ఎంపీ, నగర టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి, నారాయణ, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర





## రేపటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ

**• పోలింగ్ రోజున లేబర్ హాలిడే: కలెక్టర్**

**నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 30 :** మే 2వ తేదీ నుంచి ప్రతి ఇంటికి ఓటరు సమాచార స్లిప్పులను పంపిణీ చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సర్వీసు ఓటర్లలందరూ వినియోగించుకోవాలని కోరారు. మంగళవారం డీఆర్‌డీఏలోని మీడియా సెంటర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ పూర్తయి జిల్లాలో 129 మంది పోటీలో నిలిచారని అన్నారు. నిలిచినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. 13వ తేదీన ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల్లోగా పోలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియో గించుకోవాలనే ఉద్దేశంతో 13న లేబర్ హాలిడేగా ప్రకటిం చినట్లు చెప్పారు. పోలింగ్‌కు 48 గంటల ముందు అంటే మే 11న సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ప్రచారాలకు అనుమతి ఉంటుందని చెప్పారు. పోలింగ్ కు 48 గంటల ముందు అన్నీ హోటళ్లు, లాడ్జీలను తని ఖీలు చేస్తామని, బయట ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతి ఒక్కరూ జిల్లాను వీడి వెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటరు స్లిప్పుతోపాటు గుర్తింపు కార్డు తీసుకొచ్చి ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. సుమారు 20 వేల మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఫిసిలిటేషన్ కేంద్రాల్లో మే 5 నుంచి 7 వరకు ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పార్లమెంటుకు, అసెంబ్లీలకు రెండు ఓట్లు వేసేలా అన్ని ఏర్పాట్లు చేపట్టి నట్లు చెప్పారు. అత్యవసర విభాగాల్లో పనిచేస్తున్న 229 మంది వారికి కేటాయించిన రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో 7వ తేదీన పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని కోరారు. 85 సంవత్సరాల పైబడిన వృద్ధులు, వికలాంగులు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకొనేందుకు 1712 మందికి ఫామ్-12డి అందించామని, వీరు మే 3 నుంచి 5వ తేదీ వరకు ఒకసారి, 8 నుంచి 10వ తేదీ వరకు రెండు విడతల్లో ఇంటివద్దనే ఓట్లు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.



**• ముమ్మరంగా తనిఖీలు : ఎస్పీ**

జిల్లాలో స్వేచ్ఛంగా, నిర్భయంగా ఎన్నికలను నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.2.51 కోట్ల నగదు, రూ.26.50 లక్షల మద్యం సీజ్ చేసినట్లు చెప్పారు. 982 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేసినట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు 3 బీఎస్ఎఫ్, 4 తమిళనాడు స్పెషల్ ఆర్మ్‌డ్ ఫోర్సు పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కె.సదారావు, డీపీఆర్‌ఏ మోహన్‌రాజు, ఇంజనీర్ కిషోర్ పాల్గొన్నారు.

## వివాదాల నడుమ...


జలదంకి : కొత్తూరులో వైసీపీ నాయకుల మధ్య వివాదం

**జలదంకి :** వైసీపీలో నెలకొన్న వర్గవిభేదాల నడుమ మంగళవారం ఉదయగిరి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రచారం సాగింది. ఎల్ఆర్ అగ్రహారంలో నాయకుడు గుర్రం జగ్గయ్య ఇంటికి కాకుండా ఇతర ఇళ్లకు పోవడం ఏమిటంటూ ఆయన అనుచరులు మేకపాటి వద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో జగ్గయ్య ఇంటికి చేరుకున్న మేకపాటి తాను ఏ అభివృద్ధి పనులు చేసినా జగ్గన్న సూచనల మేరకే చేస్తానని హామీ ఇవ్వడంతో శాంతించారు. అనంతరం కొత్తూరులో కూడా మేకపాటి ప్రచారానికి ఆటంకం కలిగింది. ఒకానొక సందర్భంలో మేకపాటి వాహనం ముందుకు వచ్చి ఇరువర్గాలు వాగ్వివాదానికి దిగాయి. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను పక్కకు పంపారు. స్థానిక నాయకుల వ్యవహారశైలిపై మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు.

## పెన్షన్.. టెన్షన్!

**నేటి నుంచి బ్యాంకు ఖాతాల్లో జమ**

**నెల్లూరు (హరనాథపురం) :** ఏప్రిల్ నెలకు సంబంధించిన సామాజిక భద్రతా పించన్ల మొత్తాన్ని మే ఒకటవ తేదీన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ కానుంది. అయితే ఇక్కడే పెన్షన్‌దారులకు సమస్య మొదలవుతోంది. కొందరి బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌లో ఉండగా, మరికొందరికి ఇన్‌యాక్టివ్‌లో ఉన్నాయి. ఈ ఖాతాల్లో పించను సొమ్ము జమకాదు. ఆ మొత్తం జమకాని విషయం తెలుసుకోవడానికి ఐదవతేదీ పడుతుంది. ఆ తర్వాత సచివాలయ రెగ్యులర్ ఉద్యోగులు పించను నగదును అందజేస్తారు. ఈసారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుండటంతో పింఛనుదారులకు ఇబ్బందులకు తప్పేలా లేవు. కాగా, బ్యాంకు ఖాతాలేని పింఛనుదారులకు, దివ్యాంగులకు, కదల్లేని స్థితిలో ఉన్నవారికి, ఆరోగ్య పించన్లు, సైనిక సంక్షేమ పింఛన్‌దారులకు ఇళ్ల వద్దనే సచివాలయ రెగ్యులర్ సిబ్బంది మే 1వ తేదీ ఉదయం నుంచే పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 3,15,423 మంది పింఛనుదారులు ఉండగా, రూ.94.38 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. వీరిలో ఇంటివద్దనే తీసుకునేవారు 79,734 మంది, బ్యాంకు ఖాతా కలిగినవారు ఉన్నారు.

## ఈతకెళ్లి అన్నదమ్ముల దుర్మరణం

**• ఉప్పలపాడు వద్ద దుర్ఘటన • పాతాళపల్లిలో విషాదం**

**అనంతసాగరం:** ఈత సరదా ఓ కుటుంబాన్ని విషాదంలో నింపింది. స్నేహితులతో కలిసి పెన్నానదిలో ఈతకెళ్లిన అన్నదమ్ములు మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని ఉప్పలపాడు వద్ద పెన్నానదిలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు, మండలంలోని పాతాళపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మిట్టమల్ల చిన్న వెంకటయ్య కుమారులు వంశీకృష్ణ (25), నరసింహ (23)లు అన్నదమ్ములు. మంగళవారం మధ్యాహ్నం వారిద్దరూ స్నేహితులతో కలసి సరదాగా జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద పెన్నానదిలో ఈతకు వెళ్లారు. నరసింహ నీటిలో మునిగి ఎంతకీ రాకపోవడంతో అతడి కోసం వంశీకృష్ణ లోతున ప్రాంతానికి వెళ్లి గల్లంతయ్యాడు. దీంతో వారి కోసం మిగతా మిత్రులు గాలించగా వంశీకృష్ణ దొరికాడు. అతన్ని వెలికితీసి 108 వాహనం ద్వారా ఆసుపత్రి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందినట్లు సిబ్బంది గుర్తించారు. ఇక నరసింహ ఆచూకీ లభించలేదు. చీకటి పడడంతో గాలింపునకు ఆటంకం కలిగింది. సోమశిల నుంచి గజఈతగాళ్లను పిలిపించి లైట్ల వెలుతురులో గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు రాత్రి 8 గంటల ప్రాంతంలో నరసింహ మృతదేహం కూడా లభ్యమైంది. సంఘటనాస్థలానికి చేరుకున్న ఆత్మకూరు సీఐ జీ వేణు, సోమశిల ఎస్ఐ సుబ్బారావు పరిస్థితిని సమీక్షించారు. ఈ మేరకు మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆత్మకూరుకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈసంఘటనతో పాతాళపల్లిలో విషాదఛాయలు అలుముకొన్నాయి. బిడ్డల్ని కోల్పోయిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.


మృతులు వంశీకృష్ణ, నరసింహ (ఫైల్)

# ఆత్మకూరు ఉదయగిరి



## ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంఈవోలు, మెట్టుకూరు ధనుంజయ రెడ్డి

**అనంతసాగరం, ఏప్రిల్ 30:** సంజీవనగరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పాపిశెట్టి నరసింహులు మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా అనంతసాగరంలోని పంక్షన్‌హాల్ ఘన సన్మానం చేశారు. నెల్లూరు మాజీ ఎన్‌డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి, ఆత్మకూరు, అనంతసాగరం ఎంఈవోలు నజీర్‌బాషా, బాలకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సోమశిల ప్రాజె క్టు ఈఈ దశరథ రామిరెడ్డి, జెడ్పీటీసీ రాపూరు వెంకటసు బ్బారెడ్డి, ఎంపీపీ సంపూర్ణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తొలుత ఉపాధ్యాయుడు నరసింహులు, సతీమణిని బస్టాండ్ సెంటర్ నుంచి మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు.

## 11మంది వలంటీర్ల రాజీనామా

**కలువాయి:** మండలంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 72మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. మంగళవారం మరో 11మంది రాజీనామా చేశారు. దీంతో వీరి సంఖ్య 83 మందికి చేరుకుంది. అధికార నాయకులు ఒత్తిళ్లతోనే రాజీనామాలు కొనసాగుతున్నాయి.

# ఎన్నాళ్లీ రోడ్డు దుస్థితి!

- గుంతలమయంగా నల్లపరెడ్డిపల్లి రహదారి
- ఇబ్బందుల్లో వాహనదారులు, గ్రామాల ప్రజలు

**ఆత్మకూరు, ఏప్రిల్ 30:** మండలంలోని నల్లపరెడ్డిపల్లి తారురోడ్డులో పెద్ద గుంతలు పడి గుంతలమయంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆత్మకూరు నుంచి నల్లపరెడ్డిపల్లి మీదుగా మురగళ్ల, కనుపూరుపల్లి గ్రామాలకు ఈ రోడ్డు నుంచే వెళ్లాలి. నిత్యం రాకపోకలు జరుగుతుండడంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు దుస్థితి గురించి పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని వాపోతున్నారు. అత్యవసర సమయాల్లో ఈ రోడ్డులో టైంకు గమ్యం చేరలేకపోతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టిన పాపాన పోలేదని మండిపడుతున్నారు. రాత్రుల సమయాల్లో ఈ రోడ్డున వెళ్లాలంటే సహసం చేసినట్లే అని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన నల్లపరెడ్డిపల్లి రోడ్డు

## కుక్కల దాడిలో దుప్పికి గాయాలు

**ఉదయగిరి, ఏప్రిల్ 30:** స్థానిక దేవలాల గడ్డలో మంగళవారం కుక్కల బారినపడ్డ దుప్పిని స్థానికులు గుర్తించి రక్షించారు. ఆ వివరాల మేరకు.. తెల్లవారుజామున ఉదయగిరి దుర్గం అటవీ ప్రాంతం నుంచి ఓ దుప్పి తాగునీటి కోసం హుస్సేన్ కుంట సమీపానికి వచ్చింది. అక్కడ ఊరకుక్కలు దాడి చేయడంతో దుప్పి వీధుల్లోకి పరుగులు తీసింది. వేకుజామున ఆరుయబట అరుగులపైన సేదతీరుతున్న రంతుజానీ, అవేజ్‌మస్తాన్, మహ మ్మద్‌లు గమనించి కుక్కలను అడ్డుకుని దుప్పిని రక్షించారు. దాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. ఉదయగిరి రేంజ్ అధికారి ఉమామహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఏబీవోలు వెంకటేశ్వర్లు, లక్ష్మీప్రసన్నలు అక్కడికి చేరుకొని గాయాలపాలైన దుప్పిని పశువైద్యశాలకు తరలించి ప్రథమచికిత్స అనంతరం దుర్గం హనుమాన్ నాలా అటవీ ప్రాంతంలో దాన్ని వదిలారు. దుప్పిని రక్షించిన స్థానికులను వారు అభినందించారు.



గాయాలపాలైన దుప్పిని రక్షించిన స్థానికులు

## సోమశిలలో 8.187 టీఎంసీల నిల్వ

**అనంతసాగరం, ఏప్రిల్ 30:** సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. మంగళవారానికి జలాశయంలో 8.187 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10క్యూసెక్కులు నీరు సరఫరా చేస్తున్నారు.

## బొమ్మవరం భూ పంపిణీలో మోసం

**అనంతసాగరం, ఏప్రిల్ 30:** బొమ్మవరం భూపంపిణీలో అంతా మోసం జరిగిందని టీడీపీ మండల యువత అధ్యక్షుడు గూడూరు శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయంపై మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండురోజుల క్రితం ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి 130 ఎకరాలు పేదలకు ఇచ్చినట్లు ప్రచారం చేశారని, అయితే అందులో అర్హులు ఎంత మంది ఉన్నారో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. భూపంపిణీ జాబితాలో వైసీపీ ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఉన్నారని ఎమ్మెల్యే విచారించి వాస్తవాలు గుర్తించాలని కోరారు. భూపంపిణీలో నాయకులు చేతివాటం ప్రదర్శించి పేదలకు అన్యాయం చేశారన్నారు.

## ఖర్చుల వివరాలు పక్కాగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో

**ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 30:** నియోజకవర్గ ఎన్నికల బరిలో ఉన్న వివిధ పార్టీల అభ్యర్థుల రోజువారి ఖర్చుల వివరాలు పక్కాగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభ్యర్థులు రోజు వారి ఖర్చుల వివరాలను పక్కాగా నమోదు చేస్తుండాల న్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఖర్చు పెట్టాలన్నారు. ఖర్చులవివరాలపై వ్యయ పరిశీలకులు తనిఖీలు చేపడతారన్నారు. రూ.10వేలలోపు ఖర్చుకు నగదు చెల్లించవచ్చన్నారు. రూ.10వేలు పైబడితే అకౌంట్ పే, చెక్ ద్వారా చెల్లించాలన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు.

# అన్నివర్గాలకు మేలు చేసేది టీడీపీ మేనిఫెస్టో

- ఆత్మకూరు ఉమ్మడి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి
- ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చర్యలు

**చేజర్ల, ఏప్రిల్ 30:** తెలుగుదేశం, బీజేపీ, జనసేన విడుదల చేసిన ఉమ్మడి మేనిఫెస్టో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూరుస్తుందని ఆత్మకూరు నియోజకవర్గ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ శాసనసభ్యులు కొమ్మి లక్ష్మయ్యనాయుడుతో కలసి మండలంలోని నడిగడ్డఅగ్రహారం, మూముడూరు, రెడ్డివారికండ్రిక, తూర్పుపల్లి ఓబులాయపల్లి, పాతపాడు, యనయదల, టి.కే.పాడు, మడపల్లి గ్రామాల్లో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం ప్రవేశపెట్టని విధంగా ఉమ్మడి మేనిఫెస్టో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఇప్పటికే సూపర్‌సిక్స్ పేరులో ఆరు హామీలను మీ ముందు ఉంచడంతో పాటు యువత సంక్షేమం, బీసీ డిక్లరేషన్, కాపు సంక్షేమం, సామాజిక భద్రత పించన్ల పెంపు, పేదలందరికీ నాణ్యమైన ఇళ్లు, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి, ఎస్సీ ఎస్టీ సంక్షేమం, మహిళా సంక్షేమం, ల్యాండ్ టైటిల్ యాక్ట్, చంద్రన్న భీమా పథకం ఇలా అనేక సంక్షేమ పథకాలను పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రజలకు మేలు చేకూరడమే లక్ష్యంగా రూపొందిచినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ఆత్మకూరు నియోజరవర్గంలో ఒక్క ఎకరాలకు నీరందలేదు అనే మాట రాకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గతంలో చేజర్ల మండలంలో పది కోట్ల రూపాయలు పైగా అభివృద్ధి చేయగా అనంతరం వచ్చిన పాలకులు అభివృద్ధి పాపా నే పోలేదన్నారు. ఆఖరికి మందు తాగే వారిని కూడా తాకట్టు పెట్టినట్లు ఎద్దేవా చేశారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కూటమి విజయా నికి అన్ని వర్గాల సంపూర్ణ మద్దతు ఇచ్చి సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ ఈడీ గిరినాయుడు, మెట్టుకూరు ధనుంజ యరెడ్డి, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయ రెడ్డి పాల్గొన్నారు.



చేజర్ల : మూముడూరులో ఎన్నికల ప్రచారంలో ఆత్మకూరు ఉమ్మడి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి

### ఎన్నికల ప్రచారంలో ఆనం కైవల్యారెడ్డి

**ఆత్మకూరు:** రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమాలు అమలు చేయడంలో టీడీపీతో పోటీ పడే సత్తా వైసీపీకి లేదని, ఆత్మకూరు అభివృద్ధి ఆనం రామనారాయణరెడ్డి తోనే సాధ్యమని ఆనం కైవల్యారెడ్డి అన్నారు. పట్టణంలోని 23 వార్డులో ఆమె టీడీపీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి కూటమి మెనిఫెస్టో హామీలను, సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ప్రజలు ఎన్డీఏ కూటమి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను ఆశీర్వదించి ఓటు వేసి గెలిపించాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు. రెండోసారి వైసీపీ నేతలు మీ వద్దకు వస్తున్నారని వారిని నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజా రెడ్డి, చెరుకూరు పద్మావతమ్మ, మున్సిపల్ కౌన్సిలరు మాదాల శ్రీనివాసు లనాయుడు పాల్గొన్నారు.

### వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

**అనంతసాగరం:** శంకరనగరంకు చెందిన పలువురు వైపీపీ శ్రేణులు మంగళవారం తెలుగుదేశంలో చేరారు. చేజర్లలోని ఆనం గార్డెన్‌లో ఆనం రామ నారాయణరెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో ఉప సర్పంచ్ వసుంధర నాయకులు మాల్యాద్రి, శీనయ్య, శాఖమూరి రమణ య్యనాయుడు, పుల్లయ్య, సుబ్బానాయుడు, రమేష్‌తో పాటు 25కుటుంబాలు ఉన్నాయి. కార్య క్రమంలో మండల నాయకులు మెట్టుకూరు కృష్ణారెడ్డి, కార్తీక్, మాజీ సర్పంచ్ బందుల నరసింహులు ఉన్నారు.

### బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీపై ప్రచారం

**ఏ ఎస్ పేట:** టీడీపీ మండల కన్వీనర్ అబ్బూరి రమేష్‌నాయుడు స్థానిక నాయకులతో కలిసి ఏఎస్ పేటలోని తూర్పు వీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకీ గ్యారంటీపై కార్యక్రమంపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షేక్‌జిలాని బాషా, ఖజమియ్య, షేక్ ఖాదర్ బాషా, అఫ్జల్, వాకిచర్ల బాబు, గోవిందయ్య, పద్మయ్య, కలాం తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఆనం కైవల్యారెడ్డి



ఆనం సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు



# ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసిన ఘనుడు జగన్!

- జలదంకి ఎన్నికల ప్రచారంలో టీడీపీ కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్

**జలదంకి, ఏప్రిల్30:** ఆరోగ్యశ్రీ పథకాన్ని పేదలకు అందకుండా నిర్వీర్యం చేసిన ఘనుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డి అని ఉదయగిరి ఎన్డీఏ కూ టమి అభ్యర్థి కాకర్ల సురేష్ ఆరోపించారు. మంగళవారం ఆయన కేశవరం, గట్టుపల్లి, రామవరప్పాడు, చోడవరంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాటాడారు. ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేగా తనకు సైకిల్ గుర్తుపై మే 13న జరగనున్న పోలింగ్‌లో ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గతంలో ఏ ప్రభుత్వంలోనైనా ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే పేదలకు ఒక భరోసా ఉండేదని నేడు ఆ పరిస్థితి లేదన్నారు. గత ఎన్నికల సమయంలో మద్య నిషేదం చేస్తానని హామీ ఇచ్చిన జగన్ దాన్ని అమలు చేయకపోగా కల్తీ లిక్కర్ ను అధిక ధరలకు ప్రభుత్వమే విక్రయించి సొమ్ము చేసుకున్నాడని మండిపడ్డా రు. 25ఎంపీ సీట్లిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేహోదా తెస్తానని రాష్ట్ర ప్రజల కు ఇచ్చిన హామీని గాలికొదిలేసి కేంద్రం వద్ద తనకేసుల కోసం కాళ్లపై పడి పత్యేకహోదా మాట మరిచాడన్నారు. తెలుగుదేశం చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోవడం ఖాయమన్నారు. వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఓటమి భయంతో ఓటర్లను బెదిస్తున్నాడని విమ ర్శించారు. సుదీర్ఘకాలంగా నిలిచిన గొట్టిపాటి కొండపనాయుడు కాలువ(ఉత్తరకాలువ) పనులు ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే శరవేగంగా పూర్తి చేయించి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. జలదంకి-తెల్లపాడు రోడ్డు పనులు పునఃప్రారంభిమన్నారు. గట్టుపల్లిలో నిలిచిపోయిన మంచినీటి మదర్‌ప్లాంటును తిరిగి తెరిపించి మండల ప్రజలకు దాహార్తి తీరుస్తానని హామీ ఇచ్చారు. కేశవరంలో మాజీ సర్పంచ్ గద్దె బ్రహ్మయ్య యాదవ్ నాయకత్వంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి కాకర్ల సురేష్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మధురెడ్డి, భాస్కర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, వినోద్ నాయుడు, మదుసూదనరావు, మాల్యాద్రియాదవ్, ప్రసాద్‌నాయుడు, కొల్లా క్రిష్ణ, ఉప్పుటూరి సుధీర్‌బాబు, ఉన్నం రవి, జాజుల శివరామయ్యయాదవ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఉదయగిరి రూరల్:** ఈ ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ అన్నారు. కుర్రపల్లి, శకునాలపల్లి గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొని మాట్లాడారు. ఒక్క అవకాశమని చెప్పి సీఎం జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే ప్రజలు గ్రామాలు వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవాల్సి వస్తుందన్నారు. టీడీపీ కూటమి ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతో పేదలందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాకర్ల సునీల్, మన్నేటి వెంకటరెడ్డి, సీహెచ్ బయ్యన్న, గడ్డం వెంకటేశ్వర్లు, నరసయ్య, చెన్నయ్య, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్):** నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు నర్రవాడ, తెడ్డుపాడు, కొత్తపేట, ఏఏ కాలనీల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ, మోహన్‌రావు, పందిటి అంబేద్కర్, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

ప్రజాసేవకులైన నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి కోరారు. లక్ష్మీపురం, కమ్మవారిపాళెంలో కాకర్ల సురేష్ సతీమణి కాకర్ల ప్రవీణతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వ హించారు. మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవ గాహన కల్పిం చారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో సర్వనాశనం అయ్యిం దన్నారు. టీడీపీ కూటమి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కంభం అనుసూయమ్మ పాల్గొన్నారు.



జలదంకి: కాకర్లను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

**సీతారామపురం:** స్థానిక పంచాయతీలోని నారాయణంపేటలో మంగళవారం ఎంపీటీసీ తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, ఉదయగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ భోగినేని కాశిరావుతో కలిసి ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటికీ తిరిగారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్థాపించిన వాటర్ ప్లాంట్‌ల గురించి, విద్య, వైద్య రంగంలో ఆయన చేస్తున్న సేవలు, కాకర్ల సురేష్ రెండు సంవత్సరాల నుంచి చేస్తున్న సేవల గురించి వివరించారు. తెలుగుదేశం మేనిఫెస్టోలో బీసీలకు పెద్ద పీట వేశారన్నారు. కార్యక్రమంలో తమ్మిశెట్టి రమణయ్య, రఘు, సింగాల సుబ్బయ్య, పాలిశెట్టి శ్రీను, పిడుగు పవన్ పాల్గొన్నారు.

**వరికుంటపాడు:** ఉమ్మడి నెల్లూరు పార్లమెంట్, నియోకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌ల విజయానికి తమవంతు బాధ్యతగా కృషి చేస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు తెలిపారు. నల్లబోతులవారిపల్లి, ఇస్కపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన మాట్లాడారు. అన్నివర్గాలకు సంక్షేమ పథకాలను కొనసాగించడం తెలుగుదేశం పార్టీకే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను అందించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముజ్జి లక్ష్మీనారాయణ, చంద్ర వెంకయ్య, భోగినేని శ్రీనివాసులు, నాగినేని వెంకటేశ్వర్లు, ఆండ్రా బాలగురవారెడ్డి, కామేపల్లి వెంకటరత్నం, గంగవరపు పుల్లయ్య పాల్గొన్నారు.



దుత్తలూరు: ప్రచారం నిర్వహిస్తున్న కంభం, కాకర్ల ప్రవీణ



ఉదయగిరి రూరల్: మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కంభం, చెంచలబాబు

## బ్యాంకు ఖాతాల్లో పింఛన్ల జమ

**కలువాయి, ఏప్రిల్ 30:** సామాజిక భద్రత పింఛన్లు లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్‌లోకి జమ చేస్తున్నట్లు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. పింఛనుదారుల ఆధార్ లింక్ అయిన బ్యాంక్ అకౌంట్‌కు పింఛను వేయనున్నట్లు చెప్పారు. 4,961 మందికి సంబంధించిన రూ.1.48కోట్లు డీబీటీ ద్వారా బ్యాంక్ అకౌంట్లు, మరో 1,539 మందికి రూ.46లక్షలు ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. పింఛన్లు కోసం ఎవరూ సచివాలయాల వద్దకు రాకూడదని సూచించారు. 2వతేదీ నుంచి గ్రామాల్లో ఉన్న బిజినెస్ కన్సలెంట్ ద్వారా పింఛను మొత్తాలను తీసుకోవాలని వివరించారు.

## కురుగొండ్ల గెలుపే లక్ష్యం

కలువాయిలో ముమ్మరంగా ఇంటింటి ప్రచారం



కలువాయి : ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న చల్లా ఇందిర, టీడీపీ నాయకులు

**కలువాయి, ఏప్రిల్ 30:** వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ గెలుపే లక్ష్యంగా మంగళవానం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు మండలకేంద్రంలో ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. కలువాయి మాజీ సర్పంచ్ చల్లా ఇందిర ఆమె భర్త చల్లా రఘురామిరెడ్డి, చల్లా శ్రీనివాసులరెడ్డి (బుజ్జిరెడ్డి), గడ్డం కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి కురుగొండ్ల రామకృష్ణ సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిం చారు. తెలుగుదేశం సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు అందజేసి అవగాహన కల్పించారు. వారి వెంట బీజేపీ నాయకులు దండు పెంచలయ్య ఉన్నారు.

## పగులు ఎండ.. రాత్రి మంచు



తెల్లవారుజామున ఉదయగిరి దుర్గంపై కురుస్తున్న మంచు

**ఉదయగిరి, ఏప్రిల్ 30:** నియోజకవర్గ ప్రాంతంలో పగటివేళ ఎండ ప్రచండంతో ప్రజలు విలవిలలా డుతున్నారు. ఈ మాసంలో 38 నుంచి 44 డిగ్రీల వరకు ఎండ తీవ్రత ఉన్నది. దీంతో వృద్ధులు, పిల్లలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా ప్రతిరోజు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మంచుదుప్పిటి కమ్ముకుంటోంది. ఈ వాతావరణంలో ఏర్పడే మార్పులతో అనారోగ్య సమస్యలు వస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే మే నెలలో ఎండతీవ్రత ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

# కావలి
# కందుకూరు

### వన్యప్రాణుల దాహార్తిని తీర్చండి

కొండాపురం, ఏప్రిల్ 30: మండల పరిధిలోని గానుగ పెంట పంచాయతీ పరిధిలో సుమారు 1,300 ఎకరాల సామాజిక అటవీప్రాంతం ఉంది. ఈ అటవీ ప్రాంతంలో జింకలు అధికంగా ఉంటాయని గ్రామస్థులు అంటున్నారు. వేసవికాలం రావడంతో సమీప ప్రాంతాల్లోని కుంటలు, చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో అటవీప్రాంతంలోని వన్యప్రాణుల దాహం తీర్చుకునేందుకు ఎటువంటి అవకాశంలేదు. నీరు దొరక్క జింకలు మరణించే అవకాశం ఉందని, అటవీప్రాంతంలో కృత్రిమంగా తాగునీటి వసతులు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

### 181 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, ఏప్రిల్ 30: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 740 పొగాకు బేళ్ళ విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 559 బేళ్ల కొనుగోలు చేశారు. నోబిడ్-137, ఆర్-2 సీఆర్-33, జంపింగ్‌లాట్స్-9 కారణాలతో 181 బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.292, కనిష్ఠ ధర రూ.216, సగటు ధర రూ.255.95 నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

# అన్నివర్గాల అభివృద్ధికి దిక్సూచి ఎన్డీఏ మేనిఫెస్టో

● గుడ్లూరు మండలంలో ఇంటూరి నాగేశ్వరరావు విస్తృత ప్రచారం



ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరిన ముస్లింలు

గుడ్లూరు, ఏప్రిల్ 30: ఎన్డీఏ కూటమి తరపున టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్‌కళ్యాణ్‌లు ఉమ్మడిగా విడుదల చేసిన మ్యానిఫెస్టో అన్నివర్గాల అభ్యున్నతికి దిక్సూచి అని కందుకూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని ఏలూరుపాడు, శాంతినగర్, ఎస్టీకాలనీ, సాలిపేట, పూరేటిపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో టీడీపీ శ్రేణులతో పాటు యువకులు, మహిళలు ఉత్సాహంగా నాగేశ్వరరావుకు ఎదురేగి ఘన స్వాగతం పలికారు. గత ఎన్నికల్లో వైసీపీ విజయమే ధ్యేయంగా ఓటు వేసిన అనేకమంది రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిందేనంటూ నాగేశ్వరరావుకు సంఘీభావం తెలిపారు. చంద్రబాబు సీఎం కావడమే లక్ష్యంగా సైకిల్ గుర్తుకు ఓటువేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని, తామంతా టీడీపీ గెలుపుకోసం శక్తివంచన లేకుండా పనిచేస్తామని తెలిపారు. గ్రామగ్రామాన ప్రజల్లో వస్తున్న అనూహ్యస్పందనతో నాగేశ్వరరావు ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొన్నారు. పోర్టు అనుబంధంగా పరిశ్రమల పేరుతో ఈ ప్రాంతంలోని భూములను కారుచౌకగా లాగేసుకునేందుకు వైసీపీ నాయకులు కుట్రపన్నారని, రైతులు సంఘటితంగా ప్రతిఘటించాలని సూచించారు. ఈ ప్రచారంలో ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, పార్టీ నాయకులు నిమ్మకాయల రమణయ్య, జడ నాగేశ్వరరావు, అత్తంటి శ్రీనివాసులు, గద్దగుంట శ్రీను, రామకృష్ణ, పఠాన్ రామారావు, అట్లా కోటయ్య, చల్లా మోహనరావు, జడ శ్రీను, ఉమ్మినేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీలో చేరికలు

కందుకూరు : పట్టణంలోని 18వ వార్డుకు చెందిన పలు ముస్లిం కుటుంబాల వారు టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. షేక్ గౌస్ బాషా, షేక్ ఖాదర్‌బాషా, షేక్ షాహుల్ కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరగా నాగేశ్వరరావు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నగర జయకృష్ణ, షేక్ ఫాజిల్, షేక్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

### 3, 4 వార్డులలో ఇంటూరి సౌజన్య ప్రచారం

తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులైన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులకు సైకిల్ గుర్తుపై ఓటువేసి మంచి మెజారిటీ అందించాలని కోరుతూ నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య మంగళవారం పట్టణంలోని 3, 4 వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇద్దరు అభ్యర్థులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు ఎంతో మేలుచేశారని భవిష్యత్తులోను ప్రజాప్రతినిధులుగా గెలిపిస్తే మీ కష్టసుఖాలలో తోడుగా ఉంటారని తెలుపుతూ ఆమె టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమెవెంట టీడీపీ నాయకులు పువ్వాడి కోటయ్య, మచ్చా మనోహర్, చుండూరి మాల్యాద్రి, నందికనమల లక్ష్మణరావు, పెట్లూరి సుబ్బారావు, చల్లా మహేంద్ర, గుమ్మా శివ, నందనవనం రాము, భవనాసి వెంకటేశ్వర్లు, అత్తంటి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### సౌజన్యతో కలిసి బీజేపీ నేతల ప్రచారం

ఎన్డీఏ కూటమి బలపరుస్తున్న టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ కందుకూరులో టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్యతో కలిసి బీజేపీ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుల విజయంలో భాగస్వాములు కావాలని కోరారు. బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జొన్నాదుల రాఘవయ్య, మన్నేపల్లి వరప్రసాదరావు, జగన్నాథం వైకుంఠం, అమలనాథుని మాల్యాద్రినాయుడు, ఎం.భూషయ్య, నవులూరి రాజేష్, దార్ల రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



ఇంటూరి సౌజన్యతో కలిసి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

### అభ్యర్థుల విధి విధానాలపై అవగాహన



ఆర్డీవో కార్యాలయంలో కావలి అసెంబ్లీ అభ్యర్థులు, ప్రతినిధులతో మాట్లాడుతున్న జనరల్ అబ్జర్వర్

కావలి, ఏప్రిల్ 30 : కావలి అసెంబ్లీ నియోజకవర్గ నుంచి పోటీ చేసే అభ్యర్థులు విధివిధానాలు, వారు పాటించాల్సిన నియమ నిబంధనలపై జనరల్ అబ్జర్వర్ రామ్‌కుమార్ గౌతమ్ అవగాహన కల్పించారు. కావలి ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఆయన కావలి రిటర్నింగ్ అధికారి శీనా నాయక్‌తో కలసి పోటీ చేసే అభ్యర్థులు, వారి ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అభ్యర్థులు ఎన్నికల ఖర్చులకు సంబంధించిన అకౌంట్స్ నిర్వహణ ఎలా చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. అలాగే ఈవీఎంల కమిషనింగ్ సమయంలో అభ్యర్థులు కానీ వారి ప్రతినిధులు కానీని హాజరై ఈవీఎంలలో బ్యాలెట్ పత్రాలు అమర్చే విధానంను పరిశీలించవచ్చన్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగం, హోమ్ ఓటు వినియోగం విధానం గురించి వివరించారు. ఈ సమావేశంలో కావలి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు జీ. శ్రావణ్‌కుమార్, నగేష్, పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ప్రతినిధులు పాల్గొన్నారు.

### 19 మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, ఏప్రిల్ 30: మోటారు సైకిల్‌పై వెళుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని అతని నుంచి 19 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాల మేరకు.. రూరల్ సీఐ కాటూరి శ్రీనివాసరావుకు అందిన సమాచారంతో మంగళవారం కావలి మండలం రుద్రకోట వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో చేవూరుకు చెందిన గాలి ప్రసాద్ తన వద్ద ఉన్న సంచిలో 19 మద్యం సీసాలు పెట్టుకుని దానిపై టవల్ కప్పుకుని అటు వైపు వెళుతున్న మోటారు సైకిల్‌ను ఆపి లిఫ్టు అడిగి చేవూరు వెళ్తుండగా సీఐ తనిఖీ చేసి పట్టుకున్నారు. అతని వద్ద మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## నార్తుఆములూరు ఉప సర్పంచు టీడీపీలో చేరిక



రవిచంద్ర సమక్షంలో టీడీపీలో చేరిన నార్తుఆములూరు ఉప సర్పంచు మల్లికార్జున, వార్డు సభ్యురాలు రమణమ్మ

అల్లూరు, ఏప్రిల్ 30 : నార్తుఆములూరు ఉపసర్పంచు గుంజి మల్లికార్జున, వార్డు సభ్యురాలు గుంజి రమణమ్మ, గుంజి లోకేష్‌లు మంగళవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సమక్షంలో నెల్లూరులోని ఆయన నివాసంలో టీడీపీలో చేరారు. వారికి రవిచంద్ర పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ వైసీపీ అరాచకాలు, పాలనా వైఫల్యాలను చూడలేక చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందన్నారు. గతంలో కూడా టీడీపీ హయాంలోనే తమ గ్రామాభివృద్ధి జరిగిదని, ఈ ఐదేళ్లలో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, కనీసం పంచాయతీలో వసతులు కూడా ఏర్పాటు చేసుకోలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంజి రుద్రయ్య, బెల్లంకొండ మల్లికార్జున, దాసరి ప్రభాకర్, పెయ్యల భాస్కర్, ఒట్టూరు బాబు, దాసరి కరుణాకర్, బెల్లంకొండ భాను, శిగినం తిరపయ్య, వట్టికాల శీనయ్య, చల్లా రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు ముఖ్యమంత్రి కావడమే లక్ష్యం

● మాజీ ఎమ్మెల్యే దివి శివరాం



నరిశెట్టివారిపాలెంలో స్థానికులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

కందుకూరు, ఏప్రిల్ 30: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తిరిగి చంద్రబాబు నాయుడును చూడాలన్న ఏకైక లక్ష్యంతో టీడీపీ అభ్యర్థుల విజయం కోసం ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకున్నానని మాజీ ఎమ్మెల్యే దివి శివరాం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పందలపాడు, నరిశెట్టివారిపాలెం గ్రామాల్లో ఆయన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్డీఏ బలపరిచిన నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావును గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలంతా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావటమే లక్ష్యంగా పని చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నరిశెట్టివారిపాలెం సర్పంచ్ ముప్పాళ్ల శ్రీనివాసరావు, నాయకులు గోచిపాతల మోషే, కూనం సుబ్బారెడ్డి, కామని రాఘవ, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాదు, వర్ల దేవదాసు, దివి శ్రీధర్, రావూరి రామకోటయ్య, కసుకుర్తి నవరత్నం, గౌడపేరు ప్రసాదరావు, గౌడపేరు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యం : వంటేరు

● తుమ్మలపెంటలో ఇంటింటి ప్రచారం



కొత్తసత్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వంటేరు

కావలి రూరల్, ఏప్రిల్ 30: ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం రెండూ కావాలంటే టీడీపీతోనే సాధ్యం అని మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం తుమ్మలపెంట పంచాయతీ కొత్తసత్రం, రెడ్డిపాలెం తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం బాగుండాలంటే నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కావాలంటే చంద్రబాబు కావాలన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థులు సౌమ్యుడు అందరివాడు అయిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని ఎంపీగా, కావ్య క్రిష్ణారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు టీడీపీకి ఓటు వేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం కాపులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో యల్లంగారి యానాదయ్య, తాతా శీనయ్య, కాటంగారి రవీంద్ర, చిట్టిబాబు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదరించండి.. అభివృద్ధి చేస్తా : కావ్య



కావ్య క్రిష్ణారెడ్డిని సన్మానించి హారతులు పడుతున్న మహిళలు



టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న క్రిష్ణారెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న కావ్య క్రిష్ణారెడ్డి

బిట్రగుంట, ఏప్రిల్ 30: జరగనున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే కావలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపుతానని టీడీపీ కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. బోగోలు మండలంలోని ఏనుగుల బావి, ముంగమూరు, తాళ్లూరు పంచాయతీలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భానుడి ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో బీజేపీ నేతలు సీవీ సత్యం, నూకసాని శ్రీనివాసులుయాదవ్‌లు, టీడీపీ, బీజేపీ జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కోళ్లదిన్నె గ్రామం నుంచి యువత భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ అభివృద్ధి జరగాలంటే అందరు కలసికట్టుగా పని చేయాలని, గెలుపు కావాలంటే అందరి సహకారం ఉండాలన్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దగల శక్తి చంద్రబాబునాయుడుకి మాత్రమే ఉందన్నారు. టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, మీవాడైన నన్ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బీద గిరిధర్ యాదవ్, యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, శ్రీనివాసులురెడ్డి, జంపాని ప్రభాకర్, ఒంటేరు ప్రసన్న, ఒ.మాల్యాద్రి, ఎల్లమ్మ, పులి సుబ్బారావు ఎల్.మాధవరావు, పాల్గొన్నారు.

### టీడీపీ గూటికి వైసీపీ నేతలు

దగదర్తి మండలం తడకలూరు గ్రామ అరుంధతివాడకు చెందిన పలువురు వైసీపీ నేతలు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు మాలేపాటి రవీంద్రనాయుడు మాట్లాడుతు వైసీపీ పాలనలో దళిత గిరిజనులకు జరిగిన మేలు ఏమీ లేదన్నారు. చంద్రబాబు పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాయితీ రుణాలు అందచేసేవారని, జగన్ పాలనలో దాచుకోవడం దోచుకోవడం తప్ప మరొకటి లేదన్నారు. అనంతరం దగదర్తి పద్మశాలి వీధి, ముస్లిం, తూర్పు వీధి, కుమ్మర వీధులో మాలేపాటి సోదరులు ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర పాలనే ధ్యేయంగా ఉమ్మడి పార్టీల అభ్యర్థులు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ దగుమాటి క్రిష్ణారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడుతో కలసి బాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నేతలు, కార్యకర్తలు, మాలేపాటి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కంపు కొడుతున్న కావలి!

● పారిశుధ్యం అధ్వానం ● అవస్థల్లో పట్టణ ప్రజలు

కావలి రూరల్, ఏప్రిల్ 30: వ్యాపార కేంద్రమైన కావలి పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా మారి కంపు కొడుతోంది. ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి, మురుగు నీరు మడుగులు కట్టి దుర్గంధం వెదజల్లుతోంది. అయినా మున్సిపల్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండగా పట్టణ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని జనతాపేట, సపోటాతోట ప్రాంతాల్లో ఓ పక్క చెత్తకుప్పలు దర్శనమిస్తుండగా మరోపక్క డ్రైనేజీ కాలువల్లో మురుగు రోడ్లపైకి చేరుతోంది. జనతాపేట నార్తు టీఎస్ఆర్ నాయుడు అపార్టుమెంట్ ఎదురుగా మున్సిపల్ సిబ్బంది ఏర్పాటు చేసిన చెత్త కుండీల్లోని చెత్తను అరకొరగా తొలగిస్తుండటంతో అది నిండిపోయి ఆ మార్గం మొత్తం చెత్తమయం అయిందని స్థానికులు వాపోతున్నారు. అలాగే జంతు కళేబరాలు కూడా వేస్తుండటంతో ఆమార్గంలో వెళ్లాలంటే ముక్కు మూసుకోక తప్పదని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంపై అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అలాగే 2వ వార్డు సచివాలయం పక్కనే మురుగు నీటి కాలువల్లో చెత్త తొలగించక పోవడంతో మురుగునీరంతా రోడ్లపైకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పట్టణంలో పారిశుధ్య లోపం తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



2వ వార్డు సచివాలయం పక్కన మురుగునీరు

### కందుకూరు ఎంపీపీ ఇంట్లో
## వలంటీర్లతో సమావేశం

● తాయిలాలు, నగదు పంపిణీకి ఏర్పాట్లు
● సీ విజిల్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు
● అధికారులకు వస్తున్నారని తెలిసి అంతా పరార్!



అధికారులు వస్తున్నారని తెలియడంతో ఎంపీపీ ఇంట్లో నుంచి జారుకుంటున్న వలంటీర్లు

కందుకూరు, ఏప్రిల్ 30 : మండలంలోని కొండముడుసుపాలెం గ్రామంలో వైసీపీ ఎంపీపీ ఇంటూరి సుశీల నివాసం వేదికగా అధికార పార్టీ నేతలు తాయిలాల పంపిణీకి సిద్ధపడ్డారు. ఎంపీపీ భర్త, ఆ గ్రామ వైసీపీ నాయకుడు మాధవరావు నేతృత్వంలో వలంటీర్లను సమావేశపరిచి వారికి బహుమతులు అందజేశారు. వారిద్వారా ఓటర్లకు తాయిలాలు అందించేందుకు సమాలోచనలు జరుపుతుండగా టీడీపీ నేతలు గుర్తించి, సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు వస్తున్నట్లు సమాచారం అందుకున్న వలంటీర్లు 16 మంది అక్కడ నుంచి జారుకున్నారు. అయితే, అధికారులు వస్తున్న సమాచారం ముందుగానే వైసీపీ నేతలకు చేరడం పట్ల టీడీపీ నేతలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఇందుకు బాధ్యులను గుర్తించి ఉన్నతాధికారులు కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

## అల్లూరులో టీడీపీ ముమ్మర ప్రచారం



అల్లూరులో ప్రచారం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

అల్లూరు, ఏప్రిల్ 30: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కూటమి అభ్యర్థుల గెలుపుకోసం నాయకులు ముమ్మర ప్రచారం చేపట్టారు. టీడీపీ జిల్లా లీగల్‌సెల్ నాయకుడు రఫీమాలిక్ ఆధ్వర్యంలో మంగళవారం అల్లూరు పట్టణ పరిధిలోని మసీదువీధి, వెంగనగుంట, ఆర్‌డీఆర్ కాలనీలలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హర్షిత్‌రెడ్డి, శ్రీనివాసులు, రహీం, సురేష్, మల్లికార్జున, వెంకమ్మ, శివ, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### పురిణిలో 120 కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో గిరిధర్, కోటారెడ్డి

మండలంలోని పురిణి పంచాయతీలోని సుబ్బానాయుడు తోపు, ఉత్తర హరిజనవాడ, బీసీ కాలనీ మందిరం, పురిణి గ్రామాల నుంచి 120 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం రాత్రి టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు. స్థానిక నాయకులు గండవరపు వెంకటేశ్వర్లు, షేక్ కాలేషా, మర్రిబోయిన సురేంద్ర, చేజర్ల హరీష్, ఎల్లు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులురెడ్డి, రేబాల శంకర్‌రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, అంబటి రాజేంద్ర, బిట్రగుట చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ప్రచారం



కరపత్రం ఆవిష్కరిస్తున్న తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధులు

కందుకూరు, ఏప్రిల్ 30: ఎన్డీఏ కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని కోరుతూ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ఆధ్వర్యంలో గుడ్లూరు మండలంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వింగ్ నియోజకవర్గ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక ఆధ్వర్యంలో గుడ్లూరు ఎస్టీ కాలనీ, ఏలూరుపాడు ఎస్సీ కాలనీ, చేవూరు, పోట్లూరు గ్రామాలలో ప్రచారం చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. జగన్ విధ్వంసకర పాలనతో రాష్ట్రానికి చేసిన ద్రోహాన్ని వివరిస్తూ మేము సైతం మనరాష్ట్రం కోసం అంటూ చంద్రబాబును సీఎంను చేయటమే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెషనల్ వింగ్ సభ్యులు సాయికృష్ణ, గట్టమనేని అఖిల, తొట్టెంపూడి అశ్విని, పల్లపోతు వెంగళరావు, మందలపు బ్రహ్మానాయుడు, గద్దగుంట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకుడు ప్రవీణ్‌కుమార్‌కు డాక్టరేట్

కావలిటౌన్, ఏప్రిల్ 30: విశ్వోదయ ఇంజనీరింగ్ కళాశాల సీఎస్సీ విభాగం అధ్యాపకుడు ఎం ప్రవీణ్‌కుమార్‌కు ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఐవోటీలో బ్లాక్‌చైన్ ఉపయోగించి గోప్యతను కాపాడే పద్ధతుల యొక్క తులనాత్మకత అధ్యాయనం అనే అంశంపై పరిశోధనం చేసినందుకు డాక్టరేట్ లభించినట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయనను విశ్వోదయ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దత్తాత్రేయ శర్మ, పరిశోధన పర్యవేక్షురాలు స్వర్ణలత, అధ్యాపకులు ప్రవీణ్‌కుమార్‌ను అభినందించారు.

## నగదు, మద్యం అక్రమ రవాణాపై నిఘా పెంచాలి


నెల్లూరు (హరనాథపురం) : నగదు, మద్యం అక్రమ రవాణాపై నిఘా పెంచాలని కలెక్టర్ హరినారాయణన్ నోడల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నోడల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. చెక్ పోస్టుల్లో సీజ్ చేసిన నగదును డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ కమిటీ వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలన్నారు. ఎన్నికల విధులు కేటాయించిన అధికారులకు, సిబ్బందికి వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని పేర్కొన్నారు. సీవిజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులన్నిటినీ పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఒక వైపు పోర్టు, మరోవైపు రైల్వే వ్యవస్థ.. వీటికి మధ్యలో జాతీయ రహదారి. అన్నింటికన్నా మించి అందుబాటులో భారీ భూబ్యాంక్, మానవ వనరులు.. ఇన్ని వసతులు ఉన్నప్పుడు పారిశ్రామిక రంగం ఏ విధంగా పరుగులు తీయాలి? కానీ గడిచిన ఐదేళ్లలో జిల్లాలో జరిగిన పారిశ్రామిక ప్రగతిని పరిశీలిస్తే ప్రభుత్వ వైఫల్యం ఏ విధంగా ఉందో స్పష్టంగా అర్థమవుతుంది. కొత్త పరిశ్రమలు రావడం అటువంచితే అప్పటికే ఏర్పాటుకు సుముఖత చూపిన భారీ పరిశ్రమలు కూడా పరార్ అవ్వడం ప్రభుత్వ తీరుకు అద్దం పడుతోంది. భూములు ఇచ్చిన రైతులు, నిరుద్యోగ యువత ఉపాధి కోసం కళ్లల్లో ఒత్తులేసుకొని ఎదురు చూసి నా చివరకు నిశారే ఎదురైంది.


• ఐదేళ్లలో పడకేసిన పారిశ్రామిక రంగం

## ఉన్నవి పాయె..
# కొత్తవి రాకపాయె..!

• అవకాశాలను అందిపుచ్చుకోని ప్రభుత్వం
• వైసీపీ ప్రభుత్వంలో రూ.1317 కోట్ల పెట్టుబడులు
• ఉత్కర్ష, క్రిబ్‌కో ఎటు పోయనో..! • మోసపోయిన నిరుద్యోగులు
• టీడీపీ ప్రభుత్వంలో రూ.19,704 కోట్ల పెట్టుబడులు





నెల్లూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో పారిశ్రామిక ప్రగతి తిరోగమనంలో పయనించింది. 2014-19 మధ్య కాలానికి, 2019-24 మధ్య కాలానికి పోలిక చూసుకుంటే భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో జిల్లాలో 12 భారీ, మెగా పరిశ్రమలు ఏర్పడ్డాయి. రూ.19,704 కోట్లతో ఏర్పాటైన ఈ పరిశ్రమల ద్వారా 4,734 మందికి ప్రత్యక్షంగా ఉపాధి దొరికింది. పరోక్షంగా మరో ఐదు వేల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.9,259 కోట్ల పెట్టుబడులతో భారీ, మెగా పరిశ్రమలు ఏర్పాటు కాగా 1,563 మందికి ఉపాధి లభించినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. అయితే ఇందులో రూ.7,942 కోట్ల పెట్టుబడులు కృష్ణపట్నం థర్మల్ ప్లాంటు మూడో యూనిట్ ఉండటం గమనార్హం. ఇది రాష్ట్ర ప్రభుత్వ సంస్థ కాగా ఈ పనులు కూడా గత ప్రభుత్వంలోనే ప్రారంభమయ్యాయి. అలానే రూ.273 కోట్లతో ఓ పరిశ్రమ, రూ.88 కోట్లతో మరో పరిశ్రమ 2019లో ప్రారంభం కాగా అవి టీడీపీ ప్రభుత్వంలో మొదలైనవేనని అధికారులు చెబుతున్నారు. దీనిని బట్టి వైసీపీ ప్రభుత్వంలో పరిశ్రమల ప్రగతి ఎంత దారుణంగా ఉందో స్పష్టమవుతోంది. ఇక 2014-19 మధ్య కాలంలో సింగిల్ విండో ఇండస్ట్రియల్ పాలసీని తీసుకొచ్చి వేగవంతంగా పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారు. జిల్లాలో మూడు ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి సేల్ డీడ్ రూపంలో విక్రయాలు చేయడంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చారు. దీంతో టీడీపీ ఐదేళ్ల కాలంలో 2,602 ఎంఎస్ఎంఈలు రూ.677 కోట్లతో ఏర్పాటు కాగా 12,465 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించింది.

• కొంపముంచిన 'సేల్ డీడ్'

వైసీపీ ప్రభుత్వంలో ఇండస్ట్రియల్ పాలసీను మార్చి భూములను సేల్ డీడ్ విధానంలో కాకుండా లీజు విధానానికి మార్చడంతో ఔత్సాహికులు వెనకడుగు వేశారు. ఒక్కరంటే ఒక్కరు కూడా ఇండస్ట్రియల్ పార్కుల్లో పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు రాలేదు. తప్పు తెలుసుకున్న వైసీపీ ప్రభుత్వం ఇటీవల లీజు డీడ్ విధానం మార్చుకొని మళ్లీ సేల్ డీడ్ విధానాన్ని ప్రవేశ పెట్టింది. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కాగా కొవిడ్ రూపంలో ఎంఎస్ఎంఈలకు భారీ కష్టం వచ్చి పడింది. అప్పటివరకూ ఎంఎస్ఎంఈల కింద రిజిస్ట్రేషన్ చేసుకోని వారు తీవ్రంగా నష్టపోయారు. ఎంఎస్ఎంఈలకు పెట్టుబడి సాయం చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఇప్పటివరకూ రిజిస్ట్రేషన్ చేసుకోని చిన్న చిన్న పరిశ్రమలన్నీ రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. 14 వేలకు పైగా ఎంఎస్ఎంఈ కింద రిజిస్ట్రేషన్ చేసుకోగా అవన్నీ వైసీపీ ప్రభుత్వంలో కొత్తగా ఏర్పాటైనవన్నట్లుగా ప్రచారం చేసుకుటుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

• భారీ పరిశ్రమలు పరార్

జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు తెలుగుదేశం ప్రభుత్వం ఎంతో కష్టపడింది. కీలకమైన మిథానీ, క్రిబ్కో వంటి కేంద్ర సంస్థలకు జిల్లాలో భూములు కూడా కేటాయించింది. కానీ వైసీపీ ప్రభుత్వంలో ఆ పరిశ్రమలు పరారయ్యాయి. కొడవలూరు మండలం బొడ్డువారిపాలెం వద్ద రక్షణ పరికరాలు తయారు చేసే మిథానీ సంస్థ రూ.3,500 కోట్లతో భారీ ప్లాంటును దక్షిణ భారత దేశంలో మొదటిసారి ఏర్పాటు చేసేందుకు టీడీపీ ప్రభుత్వంలో ముందుకొచ్చింది. 2018లో 110 ఎకరాల భూమిని కూడా అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఈ భూమిపై కొందరు కోర్టుకెళ్లడంతో అప్పట్లో పనులు ప్రారంభం కాలేదు. అయితే ఆ తర్వాత కోర్టు కేసు తొలగిపోయింది. ఈ లోపు ప్రభుత్వం కూడా మారిపోయింది. ఈ క్రమంలో మిథానీ సంస్థ రక్షణ పరికరాల తయారీ పరిశ్రమ ఏర్పాటు ఆలోచనను విరమించుకుంది. ఆ స్థానంలో మిథానీ, నాల్కో జాయింట్ వెంచర్‌గా ఏర్పాటైన ఉత్కర్ష అల్యూమినియం ధాతు నిగమ్ లిమిటెడ్ సంస్థ హైఎండ్ అల్యూమినియం ఉత్పత్తులు తయారీకి ముందుకొచ్చింది. 2020లో మిథానీ పేరు మీద ఉన్న భూములను ఉత్కర్ష పేరుపైకి మార్చారు. అయినప్పటికీ ఆ సంస్థ ఆ తర్వాత ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. 2022 ఏప్రిల్‌లో ఉత్కర్ష సంస్థ ఉన్నతాధికారులు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి సమస్యలపై చర్చించారు. అయినా పురోగతి లేదు. ప్రస్తుతం ఉత్కర్ష సంస్థ జిల్లాలో పరిశ్రమ ఏర్పాటు ఆలోచనను విరమించుకున్నట్లు ఉన్నతాధికారుల ద్వారా తెలుస్తోంది. వెంకటాచలం మండలం సర్వేపల్లి వద్ద క్రిబ్కో ఎరువుల పరిశ్రమ ఏర్పాటు తెలుగుదేశం ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. రూ. వెయ్యి కోట్లతో ఏర్పాటు చేయాలని భావించిన ఈ పరిశ్రమకు భూమి కూడా కేటాయించింది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎరువుల పరిశ్రమ ఆలోచనను క్రిబ్కో వెనక్కు తీసుకుంది. ఈ ప్లాంటు తమిళనాడులో ఏర్పాటు చేసేందుకు ఆలోచనలు జరుగుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు రావడంతో కేంద్ర మంత్రితో ఎంపీలు సంప్రదింపులు జరిపారు. ఆ తర్వాత క్రిబ్కో ఎరువుల పరిశ్రమ స్థానంలో బయో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు జరగనున్నట్లు ప్రకటించారు. కానీ అది కూడా కార్యరూపం దాల్చలేదు. ఇక రామాయపట్నంలో ఏషియన్ పేపర్ సంస్థ భారీ పరిశ్రమ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వంలో ఒప్పందం జరిగింది. కానీ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ పరిశ్రమ ఊసే కనిపించలేదు.

### సీఎం జిల్లాకు 'సెంచరీ' జంప్

ఆత్మకూరు : మండలంలోని నారంపేట వద్ద 2020, సెప్టెంబరు 20న 173 ఎకరా ల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటైంది. ఇక ఆత్మకూరు పారిశ్రామికంగా అడుగులు వేస్తుందని ప్రజలు ఎంతగానో సంబరపడ్డారు. పార్కు అభివృద్ధి కోసం తొలిగా రూ.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో 87 ఎకరాల్లో మాత్రం రోడ్లు, డ్రైనేజీ పనులు జరిగాయి. కొన్నాళ్లకు ఈ పార్కులో సెంచరీ ఫ్లైవుడ్ పరిశ్రమకు శ్రీకారం చుట్టారు. కానీ ఏమి జరిగిందో ఏమో ఈ పరిశ్రమ ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లాకు తరలిపోయింది. 2021, డిసెంబరున బద్వేల్ నియోజకవర్గంలో సదరు పరిశ్రమ ఏర్పాటుకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. వచ్చిన ఒక్క పరిశ్రమ కూడా తరలిపోవడంతో నారంపేట వద్ద పార్కు నిరుపయోగంగా మారింది. ఆత్మకూరులో సెంచరీ ఫ్లైవుడ్ పరిశ్రమ ఏర్పాటు చేసి ఉంటే రూ.1600 కోట్లు పెట్టుబడులు, 2500 పైచిలుకు ప్రత్యక్ష ఉద్యోగాలు, మరో 500 మందికి ఉపాధి లభించి ఉండేది. పరిశ్రమ తరలిపోవడంతో నిరాశే మిగిలింది.




ఆత్మకూరు : పిచ్చిమొక్కలతో నిండిన ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు కేటాయించిన స్థలం

## పేరొకటే.. ఇంటి పేర్లు తేడా !

• ఆత్మకూరు బరిలో ముగ్గురు పోటీ
• పార్టీ గుర్తుపై ఇద్దరు.. ఇండిపెండెంట్ ఒకరు

ఆత్మకూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసేవారిలో రామనారాయణరెడ్డి పేరుతో ముగ్గురు ఉన్నారు. వీరిలో ఇద్దరు పార్టీ గుర్తుపై కాగా, ఒకరు ఇండిపెండెంట్. టీడీపీ తరుపున ఆనం రామనారాయణరెడ్డి సైకిల్ గుర్తుపై పోటీ చేస్తున్నారు. అనంతసాగరం మండలం బీ అగ్రహారం గ్రామానికి చెందిన ధనిరెడ్డి రామనారాయణరెడ్డి జాతీయ జనసేన పార్టీ తరపున పెన్‌స్టాండ్ గుర్తుపై పోటీలో ఉన్నారు. అలాగే చేజర్ల మండలం మడపల్లి గ్రామానికి చెందిన సాగసాయి రామనారాయణరెడ్డి ఇండిపెండెంట్‌గా గ్లాస్ గుర్తుపై పోటీలో ఉన్నారు. కాగా అక్షరాస్యులు సైతం ఈ పేర్లు చూసి గందర గోళానికి గురయ్యే అవకాశం ఉందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే వైసీపీ చేసిన దుర్మార్గపు ఆలోచన ఇదని టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

\- సంగం



## అప్పట్లో డబ్బు ప్రభావం ఉండేది కాదు..

నేటి తరం రాజకీయాల్లో నీతినిబద్ధత లేదు. మా రోజుల్లో ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ప్రజాసేవ చేశాం. 30ఏళ్ల రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేశా. 3 సార్లు కౌన్సిలర్‌గా పనిచేశా. ఏ ఎన్నికలైనా డబ్బు ప్రభావం ఉండేది కాదు. నేడు డబ్బు ఏరులై పారుతోంది. సామాన్యులు ఎన్నికలకు దూరంగా ఉండాల్సిందే. ఆరోజుల్లో కార్యకర్తలకు ఎంతో విలువుండేది. నాయకుడ్ని కార్యకర్త నడిపించే వాడు. నేడు కార్యకర్తలను కూలీలుగా మార్చా రు. కార్పొరేట్ రాజకీయాలు నడుస్తున్నాయి కార్యకర్తలు టికెట్ తెచ్చుకున్నవారిని అనుసరించడం తప్ప, చేసేదేమి లేక సర్దుకుంటున్నారు.

\- సయ్యద్ అరబ్ బాల్వి, మాజీ కౌన్సిలర్, కావలి

## గీత దాటితే వేటు

నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో బరిలో ఉండేవారు ఎవరో తేలిపోయింది. ఇక ప్రచారాలు ఊపందుకోనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల కార్యకర్తలు నిబంధనలు మరచిపోయి అత్యుత్సాహం ప్రవర్తిస్తుంటారు. ఎన్నికల సంఘం ప్రచారానికి స్పష్టమైన గీత గీచింది. ఆ గీత దాటితే వేటు వేయనున్నది. అవేమిటంటే ప్రచార వాహనాలకు రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలి. ఆ అనుమతి పత్రాన్ని వాహనానికి అతికించాలి. అనుమతి పొందిన వ్యక్తే వాహనం వాడాలి. ఇతరులు వాడితో చర్యలు తీసుకుంటారు. విద్యా సంస్థలు, వాటి మైదానాల్లో ప్రచారం చేయకూడదు. కరపత్రాలపై ముద్రణాలయాల పేరు, చిరునామా కచ్చితంగా ఉండాలి. ప్రచారంలో టోపీలు, కండువాలు ఇవ్వవచ్చు. అయితే వీటిని ఎన్నికల ఖర్చులో చూపించాలి. ధరించే దుస్తులు మాత్రం ఇవ్వకూడదు. దేవుళ్ల ఫొటోలు అభ్యర్థి ఫొటోతో కలిసి డైరీలు, క్యాలెండర్లు ప్రచురించ కూడదు. వాహనాలపై మతపరమైన ఫొటోలు, అభ్యర్థి ఫొటో ఉండకూడదు. ప్రార్థనా స్థలాలకు, పాఠశాలలకు పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల లోపు రాజకీయ పార్టీల కార్యాలయాలు ఉండ కూడదు. రాత్రి 10 గంటల తరువాత, ఉదయం 6 గంటల లోపు మైకులు, లౌడ్‌స్పీకర్లు వాడకూడదు. ఏజెంట్ సంబంధిత పోలింగ్ బూత్ ఓటరై ఉండాలి. ఊరేగింపు మార్గాన్ని ముందుగానే పోలీసులకు తెలియజేయాలి. దిష్టిబొమ్మలు తగల బెట్టకూడదు. ఈ నిబంధనలు పాటించకుంటే ఇబ్బందులు ఎదుర్కొంటారు.


\- వలేటివారిపాలెం




## ఓటు వేయకుంటే జైలు, జరిమానా

• పలు దేశాల్లో అమలు
• హక్కు వినియోగం పౌరుల బాధ్యత

ఎన్నికల్లో పౌరులు తమ ఓటును వినియోగించుకోకుంటే, కొన్ని దేశాల్లో జరిమానా విధిస్తారు. మరికొన్ని దేశాల్లో నేరస్థులుగా పరిగణించి శిక్ష కూడా వేస్తారు. ఆస్ట్రేలియాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాల్సిందే. ఓటు వేయని వారికి ఆ దేశ కరెన్సీ ప్రకారం 20 డాలర్ల జరిమానా విధిస్తారు. ఆ మొత్తాన్ని నిర్దిష్ట గడువులోగా చెల్లించకపోతే 200 డాలర్ల వరకు అదనపు జరిమానా చెల్లించాలి. బెల్జియంలో మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోని వారికి 80 యూరోల వరకు, రెండోసారి ఓటు వేయనివారికి 200 యూరోల వరకు జరిమానా విధిస్తారు. వరుసగా నాలుగుసార్లు ఓటు హక్కు వినియోగించుకోని పక్షంలో పదేళ్ల వరకు జాబితా నుంచి పేరు తొలగిస్తారు. అంతేకాక వీరికి ఉద్యోగావకాశాలు, ప్రభుత్వ పథకాల్లోనూ ప్రాధాన్యం ఇవ్వరు. బ్రెజిల్ దేశంలో ఓటు వేయని వారు ఫైన్ కట్టాలి. గ్రీసు, ఈజిప్టు దేశాల్లో ఓటు వేయని వారిపై ప్రత్యేక విచారణ చేపడతారు. సరైన కారణం చెబితే హెచ్చరించి వదిలేస్తారు. ఎలాంటి కారణం లేకుండా ఓటు వేయలేదని తేలితే జైలుశిక్ష విధిస్తారు. ఇటలీలో ఓటు వేయనివారి



పేర్లను అందరికీ తెలిసేలా అధికారిక పత్రాల్లో ప్రచురిస్తారు. పెరూలో ఓటుకు దూరంగా ఉన్నవారి డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేస్తారు. ఇలా.. ఓటు వేయనివారికి ఒక్కో దేశంలో ఒక్కో రకమైన శిక్షలు, జరిమా నాలు ఉన్నాయి. ఏ శిక్షా లేకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశమున్న మన దేశంలో ఓటు వేయకపోవడం భావ్యమా ? ఓటర్లూ బాగా ఆలోచించి సరైన నాయకులను ఎన్నుకోవడం మనందరి కర్తవ్యం.

\- పొదలకూరు

## ఆత్మీయత అంతా ఓ నాటకం




అనుబంధం, ఆత్మీయత.. అంతా ఓ నాట కం... అన్నాడో సినీకవి. అనుబంధం సంగతి ఎలా ఉన్నా తాజా ఎన్నికల్లో ఆత్మీయ త మాత్రం ఓ నాటకమేనన్నది తాజా రాజ కీయ సంఘటనలను బట్టి తెలుస్తోంది. ఈ మాటల్లో నిజమెంతో తెలియాలంటే ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ఎత్తుగడలు చూస్తే చాలు. ఓవైపు అభ్యర్థి ఖర్చులపై ఎన్నికల కమి షన్ నిఘా, మరోవైపు పైసలు తీయకపోతే కార్యకర్తలు కరువై పోయే పరిస్థితి. ఇది పోటీలో ఉన్న వారికి మింగుడుపడ డంలేదు. అందుకే తాజాగా నాయకులు ఆత్మీయ సమావేశాలను ఎంచుకుంటున్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకుల దృష్టిలో పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తమతో వస్తున్న కార్యకర్తలందరికీ మద్యం, బిర్యానీ, నగదు ఇచ్చేందుకు పుట్టిన రోజులు, పెళ్లి రోజులు.. అని చెప్పి ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశాల్లో నాయకులు తమకు ఓటు వేయాలని కోరుతున్నారు. అనంతరం కార్యకర్తలకు మద్యం, బిర్యానీ డబ్బులు పంపిణీ చేస్తున్నారు. ఈ ఖర్చులన్నీ ఎన్నికల వ్యయం కింద రాకుండా జాగ్రత్తలు పడుతున్నారు.

• అలగానిపాడు నుంచి అంతర్జాతీయ స్థాయికి..
• నేడు పుచ్చలపల్లి జయంతి

## ఆదర్శ పార్లమెంటేరియన్
# సుందరయ్య !

కోవూరు, ఏప్రిల్30 : 'సాటి పార్లమెంటు సభ్యులు కొందరు.. కొత్తరకం కార్లు ఎక్కి రాయంచ నడకతో, మత్తేభయానంతో, టీవిపోలుకుతూ, నాయకత్వపు నయగారం తొణికిసలాడుతూ.. పార్లమెంటు భవనంలో వెళ్తుండగా, సైకిలెక్కి పార్లమెంటు భవనం ముందు దిగి, స్టాండులో సైకిల్ పెట్టి, బీగం బిగిసిందో లేదో లాగి చూసుకొని, క్యారియర్‌కు కట్టిన కాయితాల ఫైలు పుచ్చుకొని, లోపలికి ప్రవేశించి తన స్థానంలో కూర్చొని నిష్ఠతో తన పనుల్లో లీనమయ్యే వ్యక్తి శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య.. అని తెలుసుకున్నప్పుడు అపరిచితులకు ఆశ్చర్యం కలుగుతుందేమోగానీ.. పరిచయస్తులకు మాత్రం ప్రతిదిన దృశ్యం' అంటూ 1960లో ఓ తెలుగువార పత్రికలో కథనం ప్రచురితమైంది. ప్రజా పోరాటాల రథసారథిగా, ప్రతిపక్షనాయకుడిగా సుందరయ్య చూపిన మార్గం ఇప్పటికీ ఆదర్శప్రాయం. ఆయన పాదముద్రలు దేశరాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలచిపోయాయి. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆయన్ను ఎందరో స్మరించుకుంటున్నారు. నేడు (మే1న) ఆయన జయంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

• అలగానిపాడు నుంచి ప్రస్థానం

కోవూరు తాలూకా అలగానిపాడులో 1918 మే 1న ధనిక రైతు కుటుంబంలో పుచ్చలపల్లి సుందరయ్య జన్మించారు. బాల్యంలోనే ఆయన వివేకానంద, రామతీర్థల బోధనలకు ఆకర్షితులయ్యారు. గాంధీ పిలుపుతో స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, కొమర రాజు లక్ష్మణరావు లాంటి సాహితీవేత్తల వికాసంతో సాంఘిక చైతన్యాన్ని పెంపొందించుకున్నారు. 14వ ఏటనే మద్రాసు కాంగ్రెస్ మహాసభలో పాల్గొన్నారు. సైమన్ కమిషన్‌ను బహిష్కరిస్తూ జరిగిన ఆందోళనలో పాల్గొన్నారు. 1930లో మద్రాసు లయోలా కాలేజీలో సోదరసమితిని స్థాపించారు. గాంధీజీ పిలుపుతో చదువుకు స్వస్తి పలికి పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో సత్యాగ్రహ శిబిరంలో పాల్గొన్నారు. దళనాయకుడిగా ఎంపికయ్యారు. దీంతో అప్పటి బ్రిటిష ప్రభుత్వం ఆయన్ను అరెస్టు చేసి రెండేళ్ల జైలుశిక్ష విధించింది. బాలుడు కావడంతో సుందరయ్యను తంజావూరులోని బోర్డర్ జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలైన తరువాత అలగానిపాడు నుంచే ఆయన తన రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు.

• వేమన జయంతి నిర్వహణ

రాజకీయ కార్యక్షేత్రంగా అలగానిపాడు నుంచే ఆయన ఓనమాలు దిద్దుకున్నారు. మొట్టమొదటిసారిగా గ్రామంలో ఆయన వేమన జయంతిని నిర్వహించి, సవర్ణ హిందువులకు, దళితులకు కలిపి సహపంక్తి భోజనం ఏర్పాటుచేశారు. దీంతో ధనిక వర్గాలు ఆయనపై దౌర్జన్యానికి దిగాయి. గ్రామంలో బాలగంగాధర్ తిలక్ గ్రంథాలయాన్ని ఏర్పాటుచేసి యువకుల్లో చైతన్యం కలిగించారు. లాభనష్టాల ప్రమేయం లేకుండా చౌకదుకాణం నిర్వహించి గ్రామస్థుల మన్ననలు పొందారు. అలగానిపాడు వ్యవసాయ కార్మిక సంఘం పేరుతో కూలీల సంఘం ఏర్పాటుచేశారు. ఆ సంఘమే జాతీయ స్థాయి వ్యవసాయ కార్మిక సంఘంగా తరువాత కాలంలో అభివృద్ధి చెందింది. భారత కమ్యూనిస్టు పార్టీని దక్షిణాది రాష్ట్రా ల్లో బలోపేతం చేసేందుకు ఆయన ఎంతో కృషి సాగించారు. పార్టీ విభజనానంతరం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా 14 ఏళ్లపాటు పనిచేశారు. తెలంగాణ విప్లవ పోరాట రథసారథిగా తెలంగాణ సాయుధపోరాటాన్ని తీర్చిదిద్దారు. మొట్టమొదటి పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్ష నేతగా అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సైతం మెచ్చుకొనేలా ప్రసంగాలు చేశారు.



**తెలుగువారి అభ్యున్నతికి కృషి**

నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ధ్యేయంతో పుచ్చలపల్లి సుందరయ్య రచించిన 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' దిక్సూచిగా నిలుస్తోంది. తెలుగు ప్రజల సర్వతోముఖాభివృద్ధికి, జాతీయ సమైక్యతకు పథనిర్దేశం చేసిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య. తెలుగు జాతి వికాసానికి ఆయన రచించిన 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాల్సి ఉంది.

# ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలి : ఏడీఏ

**పొదలకూరు, ఏప్రిల్ 30 :** వసతి తక్కువగా వున్న చోట ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని వ్యవసాయ శాఖ ఏడీఏ మారుతీదేవి తెలిపారు. మండలంలోని పొదలకూరు, మరుపూరు, బిరదవోలు, ఇనుకుర్తి గ్రామాలలో రైతు శిక్షణ కేంద్రంలో రైతాంగానికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోర్ల కింద ఈ సీజన్‌లో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలైనటువంటి జొన్న, మొక్కజొన్న, సజ్జ, వేరుశెనగ, నువ్వులు, పెసర, మినుములు, అలసంద మొదలగు పంటలను సాగు చేసుకోవాలని రైతులను కోరారు. ఈ పంటలకు నీటని అవసరం వరి పంట కన్నా 5 నుంచి 6రెట్లు తక్కువని సాగు ఖర్చు కూడా చాలా తక్కువని ఆదాయం మాత్రం వరి పంట కన్నా ఎక్కువన్నారు. మే నెల 15 తరువాత వేరుశెనగ, నువ్వులు వేసుకోవచ్చని సలహా ఇచ్చారు. అనంతరం ఏఓలు గీతాకుమారి, చక్రవర్తిలు మాట్లాడుతూ జూన్ నెలలో పంటలు వేయదలచినవారు జొన్న, మొక్కజొన్న, వేరుశెనగ, నువ్వులు, సజ్జ, మినుములు, పెసర్లు వంటి ఆరుతడి పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. వేసవి దుక్కులు, పచ్చిరొట్ట ఎరువులు ఆవశ్యకతను బట్టి వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నాయక్, వీఏఏలు కె.చంద్రశ్రీ, గోవర్ధన్, సాయిగణేష్, శివ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధి కోసం బీజేపీని గెలిపించండి

**● ఎన్డీఏ కూటమి తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు**


మనుబోలులో టీడీపీ, బీజేపీ నాయకులతో సమావేశమైన కూటమి తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు

**మనుబోలు, ఏప్రిల్ 30:** దేశం మరింతగా అభివృద్ధి చెందాలంటే ఈ ఎన్నికల్లో మరోసారి బీజేపీయే కేంద్రంలో అధికారంలోకి రావాలని కూటమి తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. మండలకేంద్రమైన మనుబోలులో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో ఆయన మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు ఎదగడం జగన్‌కు ఇష్టంలేదన్నారు. అందుకనే తనకు రెండోసారి టిక్కెట్ ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో సిలికా, షైన్స్ డీపీడీ, వ్యవసాయ భూములు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు పెరిగాయన్నారు. ఈ ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటేసి తనను తిరుపతి ఎంపీ అభ్యర్థిగా గెలిపించాలని మూడు పార్టీల నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు పి వెంకటకృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### దళిత ద్రోహి జగన్

**పొదలకూరు:** వైసీపీ ప్రభుత్వంలో కాకాలు పట్టే వారికే పదవులు, అక్రమ మైనింగ్‌లు లభిస్తాయని, నీతి నిజాయితీతో పనిచేసే వారికి చోటు ఉండదని ఎన్డీఏ తిరుపతి పార్లమెంటు ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం పొదలకూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ నా ఎస్సీలంటూ వారి నెత్తిన జగన్ భస్మాసుర హస్తం పెట్టాడని, ఆయన ప్రభుత్వంలో ఎక్కువ బలైపోయింది ఎస్సీలేనని చెప్పారు. నా ఎస్సీలు అని రూ.25వేల కోట్ల సబ్‌ప్లాన్ లేకుండా చేశాడు. నిధులు దారి మళ్లించాడన్నారు. దళితులకు 27 సంక్షేమ పథకాలు ఇస్తే వాటిని రద్దు చేశాడని విమర్శించారు. తిరుపతి పార్లమెంటు అభివృద్ధి కోసం తాను ఎక్కడున్నా ఒక అడుగు తన నియోజకవర్గంలో ఉంటుందన్నారు. ఎన్నో ఏళ్లనాటి అటవీ క్లియరెన్స్ నోచుకోకుండా, మౌలిక సదుపాయాల కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలకు తాను ఫారెస్ట్ క్లియరెన్స్ వచ్చేలాగా చేస్తానని హామీ ఇచ్చారు. నా ఎస్సీ, నా బీసీలు, నా ఎస్టీలని చెప్పుకునే జగన్ దళిత ద్రోహిగా చరిత్రలో మిగిలిపోతారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవడానికి, తన సహకారం అడగకుండానే తానెప్పుడు ముందుంటా అన్నారు. తన ఐఏఎస్ అనుభవాన్ని ఉపయోగించి క్షేత్రస్థాయిలో నుంచి రాష్ట్రస్థాయి వరకు అభివృద్ధి, ప్రజాసేవ చేయడానికి ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముక్కు అయోధ్య రామయ్యగౌడ్, రాచపూటి ధనుంజయరావు, రవీంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.



# కోవూరు సర్వేపల్లి

### ఏకాంత సేవతో ముగిసిన నవమి పూజలు

**మనుబోలు, ఏప్రిల్ 30:** స్థానిక కోదండరామస్వామి దేవాలయంలో సోమవారం రాత్రి ఏకాంతసేవతో నవమి పూజలు ముగిశాయి. శ్రీరామనవమి నుంచి 13 రోజుల పాటు ఆలయంలో పూజలు, ఉభయాలు, అభిషేకాలు నిర్వహించారు. చివరి రోజున సీతారాములను ప్రత్యేక అలంకరణలో ఏకాంతసేవ నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు ఉభయదాతలుగా చిట్టమూరు సుధాకర్‌రెడ్డి, సునీతమ్మ దంపతులు వ్యవహరించారు.

# ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపుతా : ప్రశాంతిరెడ్డి


కొడవలూరు: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

**కొడవలూరు, ఏప్రిల్ 30:** 'ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా'నని కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. మండలంలో రెడ్డిపాలెం, ఆలూరుపాడు, మానేగుంటపాడు గ్రామాల్లో మంగళవారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆలూరుపాడులో ఆమె మాట్లాడుతూ ఆలూరుపాడులో ఇళ్ళులేని నిరుపేదలకు పక్కా ఇళ్లు కట్టిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ శ్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ నిర్మిస్తామని, మంచినీటి ట్యాంక్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే రెడ్డిపాలెంను ప్రత్యేక పంచాయతీగా అప్‌గ్రేడ్‌కు కృషిచేస్తానని తెలిపారు. పేదల జీవితాలలో వెలుగు నింపేందుకు బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా మీముందుకు వచ్చానని, అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటు వేయాలని, అరాచకపు పాలనను తరిమికొట్టాలని ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం వైసీపీ నుంచి 7, 8 వార్డు మెంబర్లు ఆమారి శ్రీనివాసులు, మంచాల భాస్కర్ టీడీపీలో చేరారు. ప్రచారంలో టీడీపీ నాయకులు కెవిఆర్ విజయ్, కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, బద్వేల్ వినీల్‌రెడ్డి, డేగా రవిరెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, బద్వేల్ గిరిధర్‌రెడ్డి, బద్వేల్ శ్రీనివాసులురెడ్డి, బద్వేల్ బాలకృష్ణారెడ్డి, పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి, చంద్రశేఖర్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● యల్లయపాళెం పంచాయతీ పరిధిలోని దాసరిపాలెంలో టీడీపీ సీనియర్ నాయకుడు గరికపాటి రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో ప్రచారం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోలగట్ల మధు, రసూల్, చిట్టిబాబు, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాల సృష్టికర్త చంద్రబాబు

**ఇందుకూరుపేట:** సంక్షేమ పథకాల సృష్టికర్త చంద్రబాబునాయుడు అని ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. ఇందుకూరుపేటలో మంగళవారం ఆమె ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేసి తెలుగుదేశం అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రమైన ఇందుకూరుపేటలో జూనియర్ కళాశాల నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాలలో తాగు, సాగునీరు సమస్య పరిష్కరిస్తామని, సైడు కాలువల నిర్మాణం చేపడతామని తెలిపారు. ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రచౌదరి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, చెంచుకిషోర్‌యాదవ్, మాదాల రాంప్రసాద్, అవ్వారు ఏడుకొండలు, మునగాల రంగారావు, నాగార్జున పాల్గొన్నారు.

### టీడీపీలో భారీ చేరికలు

**విడవలూరు:** చౌకచర్ల, విడవలూరు నుంచి వైసీపీ కార్యకర్తలు మంగళవారం టీడీపీలో చేరారు. చౌకచర్ల గ్రామం నుంచి 200 మందితో ప్రశాంతిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అదేవిధంగా విడవలూరుకు చెందిన మాజీ వలంటీరు హరి అతని అనుచరులతో సత్యావోలు సత్యంరెడ్డి, చలంచర్ల కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరికి ప్రశాంతిరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, భవాని, చేవూరు రాంప్రసాద్ పాల్గొన్నారు.

### గ్రామాల్లో విస్తృత ప్రచారాలు

వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరుతూ మండలంలోని పార్లపల్లి, విడవలూరు, దండిగుంట, అన్నారెడ్డిపాలెం, ముదివర్తి గ్రామాలలో టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ముదివర్తిలో ప్రశాంతిరెడ్డి అల్లుడు శ్రీనివాసులురెడ్డి ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు. పార్లపల్లిలోని చవటపాలెం కాలనీలో టీడీపీ నాయకులు వేగూరు చంద్రారెడ్డి, ఉచ్చూరు సుదీప్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దండిగుంటలో టీడీపీ నాయకులు కుడుముల మల్లికార్జున, విడవలూరులో ఆ పార్టీ మండల అధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు ప్రచారం నిర్వ హించారు.


బుచ్చిరెడ్డిపాళెం : ఎన్నికల ప్రచారం చేస్తున్న నీలిమారెడ్డి


విడవలూరు: ముదివర్తిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అల్లుడు శ్రీనివాసులురెడ్డి

### వేమిరెడ్డి దంపతులను గెలిపించుకుందాం

**బుచ్చిరెడ్డిపాళెం :** అవినీతికి తావులేకుండా కోవూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఎన్డీఏ ఉమ్మడి కోవూరు ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రశాంతిని, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలంటూ వారి కుమార్తె నీలిమారెడ్డి ఓటర్లను కోరారు. జొన్నవాడలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 4, 13, 14 వార్డుల్లో ఆయా వార్డుల ఇన్‌చార్జిలు వుసురుపాటి ప్రసాద్, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ, సుబ్రమణ్యంనాయుడు, ఇన్‌చార్జిలు నెల్లూరు దయాకర్‌రెడ్డి, ద్వారకానాధరెడ్డి, హరనాథ్, కిషోర్, కొండయ్య ప్రచారం నిర్వహించారు. అలాగే నాగమాంబాపురంలో మిక్సిడ్ కాలనీ, దళితవాడల్లో టీడీపీ నాయకులు ఇన్‌చార్జి వంటేరు గిరి, 10వ వార్డులో ఇన్‌చార్జి బాలాకుమార్ తదితరులు ప్రచారం నిర్వహించారు. కాగా, ఇస్కపాళెం పంచాయతీ పోలినాయుడు చెరువు గ్రామం నుంచి ఫయాజ్, షాహుల్‌తోపాటు పలువురు వైసీపీ నాయకులు టీడీపీ నాయకులు బత్తల హరికృష్ణ, సూరా శ్రీనివాసులురెడ్డి ఆధర్యంలో మంగళవారం ప్రశాంతిరెడ్డి సమక్షంలో టీడీలో చేరారు.

● **కోవూరు :** వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు కోనేటి కయ్యలు, నేతాజీ నగర్, స్టౌబీడీ కాలనీల్లో ప్రచారం చేపట్టారు. ప్రచారంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి, నీటి వినియోగదారుల సంఘం మాజీ అధ్యక్షుడు అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పడుగుపాడులో టీడీపీ నాయకులు చెంబేటి పెంచలయ్య, గంగవరపు రవిచంద్ర, పఠాన్ నజీర్‌బాష, ఆవుల వాసు ఆధ్వర్యంలో ప్రచారం జరిగింది.


కోవూరు : పడుగుపాడులో టీడీపీ నాయకుల ప్రచారం

స్థానిక టీడీపీ నాయకుడు ఓగు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైసీపీ ముఖ్య నాయకుడు కొల్లు వెంకయ్య తన అనుచరులు

# వేల ఎకరాల సేకరించి ఒక్క పరిశ్రమ తెచ్చారా : సోమిరెడ్డి


ముత్తుకూరు : పంటపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న సోమిరెడ్డి

**ముత్తుకూరు, ఏప్రిల్ 30:** వేల ఎకరాలు సేకరించి ఒక్క పరిశ్రమ తెచ్చి ఎవరికైనా ఉద్యోగాలు ఇచ్చారా అంటూ టీడీపీ, జనసేన, బీజే పీ ఉమ్మడి అభ్యర్థి సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళ వారం పంటపాలెంలో జరిగిన ప్రచారంలో సోమిరెడ్డి మాట్లాడుతూ కృష్ణపట్నం సెజ్ పేరుతో 6వేల ఎకరాలు సేకరించారని, ఒక్క పరిశ్రమ తెచ్చిన పాపాన పోలేదన్నారు. మంత్రి గా కాకాణి ఉన్న పరిశ్రమలను అడ్డుపెట్టుకొని దోచుకోవడం ప్రజల నెత్తిన కాలుష్యాన్ని రుద్దడం తప్ప చేసిందేమీ లేదని మండిపడ్డారు. రాబోయేది తమ ప్రభుత్వమేనని, కృష్ణపట్నం సెజ్, రిలయన్స్, కిసాన్ సెజ్ భూముల్లో మంచి పరిశ్రమలు తెచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఎన్డీఏ కూటమి ఆధ్వ ర్యంలో చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో ద్వారా రైతులు, పేద ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలకు రూపకల్పన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు మునుకూరు రవి కుమార్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్యామ్‌రెడ్డి, మల్లికార్జునయాదవ్, మునిరెడ్డి, బీజేపీ నాయకులు రవీంద్రరెడ్డి, పద్మనాభరెడ్డి, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**● ముస్లింలకు టీడీపీ అండ : శృతిరెడ్డి**

**పొదలకూరు :** ముస్లింలకు అండగా ఉండి అన్ని రంగాల్లో న్యాయం చేస్తున్నది టీడీపీయేనని సోమిరెడ్డి కోడలు శృతిరెడ్డి అన్నారు. పట్టణంలోని సంగంరోడ్డు వద్ద జిల్లా ముస్లిం మైనారిటీ నాయకులు జమీర్, ఖాదర్‌బాషా, షేక్ అమీర్‌బాషా ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్, యాసిన్, మంజూర్, నయీం, దిలీప్, జహీర్, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, దేవినేని శరత్, మాదినేని రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

**● 35 కుటుంబాలు టీడీపీలో చేరిక**

**వెంకటాచలం :** వేదాయపాళెంలో ఉన్న సోమిరెడ్డి కార్యాలయంలో అనికేపల్లి పంచాయతీకి చెందిన 35 కుటుంబాలు సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో హేమలత తదితరులు పాల్గొన్నారు.

● చెముడుగుంట పంచాయతీ బురాన్‌పూర్, పవన్ కాలనీల్లో సోమిరెడ్డి కుమార్తె డాక్టర్ సిందురెడ్డి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్, దొడ్ల అశోక్ తదితరులున్నారు. అలాగే అనికేపల్లి, గొలగమూడి గ్రామాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ పచారం నిర్వహించారు. కార్యక్రమంలో చల్లా రవీంద్ర, గొట్టం బ్రహ్మయ్య, పార్థసారిధి నాయుడు, తదితరులు ఉన్నారు.

● **తోటపల్లిగూడూరు :** తోటపల్లి గూడూరు గ్రామానికి చెందిన 60 కుటుంబాలు గౌడ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మన్యం రాముగౌడ్ ఆధ్వర్యంలో వేదాయపాలెంలోని సోమిరెడ్డి నివాసంలో టీడీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు. సౌత్ ఆములూరులో టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు.

### కూటమి అభ్యర్థులను
# గెలిపించండి : బీజేపీ

**వెంకటాచలం, ఏప్రిల్ 30 :** కూటమి తరుపున పోటీ చేస్తున్న తిరుపతి ఎంపీగా వెలగపల్లి వరప్రసాద్, సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ప్రజలు ఆదరించి గెలిపించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సర్వేపల్లి ఎన్నికల ఇన్‌చార్జ్ పీ సురేంద్రరెడ్డి కోరారు. వెంకటాచలంలోని ఆపార్టీ కార్యాలయంలో మంగళవారం బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్, జిల్లా కార్యదర్శి అల్లూరు ప్రసాద్‌నాయుడు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశం అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. కాకాణి ఆగడాలు, అరాచకాలు పోవాలంటే సోమిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాకుటూరు రవీంద్రరెడ్డి, అసనాపురం శ్రీనివాసులు, పిల్లిపాకుల పెంచలయ్య, గోత్తల నరేష్, ఆరణి వేణుగోపాల్‌రెడ్డి, కరీముల్లా, సండిబోయిన శ్రీనివాసులు తదితరులున్నారు.

### అధికారుల నిర్లక్ష్యంతో ఓటు కోల్పోయారు

**మనుబోలు :** రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పలువురు ఈ ఎన్నికల్లో ఓటువేసే అవకాశం కోల్పోయారని వైసీపీ నాయకులు అనమాల ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మనుబోలు చంద్రమౌళీనగర్ గిరిజన కాలనీకి చెందిన ఆవుల హనుమంతయ్య, ఆయన భార్య నాగమ్మలు, కోదండరామపురంలో పూలవ్యాపారం చేస్తున్న గూడూరు పెంచలయ్య భార్యకు, ఇద్దరు కుమారులు, తల్లికి ఓటుకోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే వీరికి ఓటర్లజాబితాలో చోటు దక్కలేదు. ఈ ఎన్నికల్లో ఓటువేసే హక్కును కోల్పోయారు. ఓ పక్క ఉన్నతాధికారులు ప్రతిఒక్కరికి ఓటు అవకాశం కల్పించాలని చెపుతుంటే, దరఖాస్తులు చేసుకున్నా ఎందుకు ఓటుకు చోటు లేకుండా చేశారు. మండలస్థాయి రెవెన్యూ అధికారులు వలన పలువురు ఓటుహక్కు కోల్పోవడం బాధాకరం. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని అనమాల ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక జోక్యం చేసుకోలేం

**● అభ్యంతరాలు ఉంటే ట్రిబ్యునల్‌ను ఆశ్రయించండి**

**● మాజీ మంత్రి నారాయణ నామినేషన్‌పై వ్యాజ్యం ట్టివేత**


**అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి):** నెల్లూరు పట్టణ అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రి నారాయణ నామినేషన్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని గుర్తు చేసింది. రాజ్యాంగంలోని అధికరణ 329(బి) కోర్టుల జోక్యాన్ని నిరోధిస్తుందన్నారు. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచిస్తూ.. పిటిషన్‌ను కొట్టివేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ తీర్పు ఇచ్చారు. నారాయణ తన నామినేషన్ పత్రాలలో భార్య వివరాలు ప్రస్తావించాల్సినచోట రెండో భార్య వివరాలను పొందుపర్చలేదని, తన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా నామినేషన్‌ను ఆమోదించారని పేర్కొంటూ నెల్లూరుకు చెందిన న్యాయవాది దేశాయ్‌శెట్టి హనుమంతురావు హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు. నిబంధనల ప్రకారం స్పౌజ్ కాలమ్‌లో భార్యకు సంబంధించిన అన్ని వివరాలను పొందుపర్చాలన్నారు. నారాయణ తన రెండో భార్య ఇందిర వివరాలను నామినేషన్ పత్రాలలో ప్రస్తావించలేదన్నారు. తమ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని, తగిన నిర్ణయాన్ని వెల్లడించేలా రిటర్నింగ్ అధికారిని ఆదేశించాలని కోరారు. నారాయణ తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై అభ్యంతరం ఉంటే ఎన్నికల ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలి తప్ప రిట్ దాఖలు చేయడానికి వీల్లేదన్నారు. వ్యాజ్యానికి విచారణార్హత లేదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ... ఎన్నికల ప్రక్రియ మధ్యలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడానికి వీల్లేదన్నారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి పిటిషన్‌ను కొట్టివేశారు.

# అగ్నిప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

**ముత్తుకూరు, ఏప్రిల్ 30 :** ఎస్ఈఐఎల్ ఎనర్జీ లిమిటెడ్‌లో అగ్నిప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని సెయిల్ కంపెనీ సీఈవో రాఘవ్ త్రివేది తెలిపారు. మంగళవారం జాతీయ అగ్నిమాపక సేవా పక్షోత్సవాల ముగింపు వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ ఫైర్ సేఫ్టీ అవగాహన పోటీలలో విజేతలను అభినందించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్ఓడీలు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు సిటీ
# నెల్లూరు రూరల్





## కాలువ కట్టక కష్టాలు!

నగరంలోని కిసాన్ నగర్‌లో ఒకటిన్నర సంవత్సరం క్రితం రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. మైపాడు వెళ్లే ఈ రహదారిని వెడల్పు చేసే క్రమంలో కొన్ని ఇళ్లను కూడా తొలగించారు. సైడు కాలువలు నిర్మించేందుకు తవ్వకాలైతే జరిపారుగానీ నేటికీ కాలువలు నిర్మించలేదు. రోడ్డు అంచున తవ్వేసి వదిలేయడంతో ఇళ్లలోకి వెళ్లాలన్నా, ఇంటి నుంచి రోడ్డు మీదకు రావాలన్నా స్థానికులు నానా అగచాట్లు పడుతున్నారు. కాలువలపై తాత్కాలికంగా చెక్కలతో వంతెనలు ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. వృద్ధులు, పిల్లలు వాటిపై నడవటంలో పట్టుతప్పి కాలువలోపడి గాయపడుతున్నారు. పాలకులు ఏడాదిన్నరగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సైడు కాలువలు కట్టకపోవడంతో తాము అష్టకష్టాలు పడుతున్నామని కిసాన్‌నగర్ వాసులు కస్సుమంటున్నారు.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్





## ఈదేద్దాం!

ఏసీ స్టేడియంలో స్విమ్మింగ్ పూల్

వేసవిలో చిన్నా, పెద్ద సందడి

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 30 : అసలే వేసవి కాలం... పైగా సెలవులు. మండుతున్న ఎండలకు చల్లదనం కోసం చిన్నారులతోపాటు పెద్దలు సైతం స్విమ్మింగ్ పూల్‌కు క్యూ కడుతున్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈత కొలనులో చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పా ట్లు చేశారు. ఈ కొలనులో చిన్నారులకు రక్షణ కవచాలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రధాన శిక్షకుడు, సహాయ శిక్షకులు సైతం కొలను చుట్టూ అప్రమత్తంగా ఉంటారు. దీంతో పెద్ద ఎత్తున చిన్నారులు ఈ కొలనులో నిత్యం ఈత నేర్చుకుంటున్నారు. పిల్లలతో పాటు పెద్దలకు కూడా అందుబాటు ధరల్లో, సమయాలను కేటాయిస్తూ పూల్‌ను నిర్వహిస్తున్నారు. ప్రమాదవ శాత్తు ఎప్పుడైనా నీటిలో పడిపోతే తనను తాను రక్షించుకోవడంతోపాటు ఆరోగ్యాన్ని పరిరక్షిం చుకునేందుకు కూడా ఈత ఎంతో దోహదం చేస్తుంది. వేసవి ఉపశమనానికితోడు మంచి వ్యాయామం కూడా కావడంతో చిన్నా,పెద్ద ఈతకు తరలివస్తున్నారు.

### ● అందరికీ అనుకూలం

స్విమ్మింగ్ పూల్‌ను అందరికీ అనుకూలంగా ఉండేలా నిర్వహిస్తున్నాము. పిల్లలు, పెద్దలకు ప్రత్యేక సమాయాలను కేటాయించి, శిక్షకులు, లైఫ్ సేవర్‌లతో అప్రమత్తంగా ఉంటున్నాము. ప్రతిరోజూ 100 నుంచి 150 మంది వరకు వస్తున్నారు. ఉదయం, సాయంత్రం రెండు రకాల సెషన్స్ ఉంటాయి.

- ఆర్‌కే యతిరాజ్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి

**ఫీజులు ఇలా..**

14 ఏళ్లలోపు పిల్లలకు నెలకు వెయ్యి రూపాయలు, 14 ఏళ్ల పైబడిన వారికి రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. 14 ఏళ్లలోపు వారికి 3 నెలలకు రూ.2,500, 14 పైబడిన వయసు వారికి 3 నెలలకు రూ.4వేలు చెల్లించాలి. ఏడాదికాలానికైతే 14 సంవత్సరాల లోపు పిల్లలకు రూ.8,500, 14 పైబడిన వారికి రూ.10,500 వసూలు చేస్తున్నారు. వారంలో ఒక రోజు సెలవు ప్రకటించి పూల్‌ను శుభ్రపరుస్తారు. ఆసక్తి కలిగిన వారు డీఎస్‌ఏ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలలోపు సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు. పూల్‌లో సాయంత్రం 5 నుంచి 7 గంటలలోపు అక్కడి సిబ్బందిని సంప్రదించి కూడా దరఖాస్తు చేసుకోవచ్చును. పాస్‌పోర్టు సైజు ఫొటోలు, వివరాలిస్తే గుర్తింపు కార్డు అందిస్తారు. ఆ కార్డు ఉంటేనే పూల్‌లోకి అనుమతిస్తారు.

## టీడీపీ ప్రభుత్వంలో ప్రపంచం మెచ్చే రాజధాని

రోడ్ షోలో రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 30 : రాష్ట్రానికి ప్రపంచం మెచ్చే అద్భుతమైన రాజధాని నిర్మాణం జరగాలంటే టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని దొంతాలి, ఆమంచర్ల గ్రామాల్లో మంగళవారం రోడ్ షో నిర్వహించారు. ఆయ న మాట్లాడుతూ ఒక్క చాన్సు అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే రాజధాని రూపకల్పన జరుగుతుందని, అప్పుడు ప్రతి ఆంధ్రుడు గర్వంగా చెప్పుకోవచ్చన్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పేదరికం దూరమవుతుందని తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని ఆర్థిక పరిపుష్టి సమకూర్చే దిశగా ఈసారి మెనిఫెస్టో తయారు చేశారన్నారు. మే 13న జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా, వీపీఆర్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. అనంతరం నెల్లూరులోని కార్యాలయంలో 31వ డివిజన్‌కు చెందిన జానీహుస్సేన్, సాబు వహీదా మిత్రబృందం, 1వ డివిజన్‌కు చెందిన ముచ్చుకాయల వేణు యాదవ్ మిత్రబృందం, 20వ డివిజన్‌కు చెందిన చల్లగుండ్ల మల్లికార్జున, పాము ర్తి సుబ్రహ్మణ్యం మిత్రబృందం, 17వ డివిజన్‌కు చెందిన ఉయ్యాల మస్తాన్, మోడీ పెంచలయ్య, కోవూరు నారాయణ మిత్రబృందాలను కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆమంచర్ల రోడ్‌షోలో మాట్లాడుతున్న అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



తెలుగుదేశం పార్టీలో చేరిన కార్యకర్తలతో గిరిధర్‌రెడ్డి

## సచివాలయ ఉద్యోగిని ఆదుకోండి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 30 : నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ అరుణాచలం వీధి సచివాలయంలో వీఆర్వోగా పనిచేస్తున్న నక్కా సుమంత్‌కుమార్ రోడ్డు ప్రమాదానికి గురై నెల్లూరు అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, అతనికి ప్రభుత్వ సహాయం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీజీఈఎఫ్ జిల్లా ఛైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు, కార్యదర్శి దేవిరెడ్డి రమణారెడ్డి ఓ ప్రకటనలో కోరారు. సుమంత్ కుమార్‌కు అపోలో వైద్యశాలలో 20రోజులుగా వైద్యసేవలు అందిస్తున్నార న్నారు. అతని తండ్రి మరణించాడని, తల్లి అనారోగ్యంతో ఉందని, వైద్యశాల బిల్లు చెల్లించలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. మరో నెలరోజులు ఆసుపత్రిలోనే చికిత్స పొందాల్సి ఉందని, తమవంతు ఆర్థిక సహాయం అందించామని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.

## ఎన్నికల పర్వం

### 160 మందికి హోం ఓటింగ్

● రేపటి నుంచి ప్రారంభం : సిటీ ఆర్వో వికాస్ మర్మత్



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ఆర్వో వికాస్ మర్మత్

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 30 : నెల్లూరు నగర నియోజకవర్గంలో 160 మందికి హోం ఓటింగ్ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆర్వో వికాస్ మర్మత్ సెక్టార్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులతో సమీక్షించారు. తాము ఇంటి వద్దనుంచే ఓటు వేస్తామని 160 మంది దరఖాస్తు చేసుకున్నందున ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గురువారం నుంచి నిర్వహించే హోం ఓటింగ్ ప్రక్రియలో భాగంగా రూట్ మ్యాప్‌ను తయారు చేసుకుని ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా ఓటు వేయించాలని అధికారులకు సూచించారు. ఇంటి వద్దే ఓటేసిన వారి ఇళ్లకు మార్కు చేయాలని ఆదేశించారు.

### రాష్ట్రాన్ని జగన్ దివాలా తీయించారు : కోటంరెడ్డి



ఇంటింటి ప్రచారంలో కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న కోటంరెడ్డి

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 30 : రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దివాలా తీయించారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విమర్శించారు. మంగళవారం 14వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. నగరంలో అభివృద్ధి జరిగిందంటే అది పొంగూరు నారాయణ వల్లేనన్నారు. అలాగే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని చెప్పారు. ఈ నేపథ్యంలో నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సిటీ ఎమ్మెల్యేగా నారాయణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, పసుపులేటి మల్లికార్జున, శేషయ్యనాయుడు, జలదంకి రమేష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీకి ఓటడిగే నైతిక హక్కు లేదు : కేతంరెడ్డి

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 30 : బలహీన వర్గాల అభివృద్ధిని విస్మరించిన వైసీపీ ఓటడిగే నైతిక హక్కు కోల్పోయిందని టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణకు మద్దతుగా మంగళవారం ఆయన 9వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. 2019 ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అధికారం చేపట్టాక విస్మరించడం వల్లే నేడు రాష్ట్రంలో వైసీపీ పరిస్థితి అధోగతిగా మారిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీని గెలిపించాలని కోరారు.

## యువతకు ఉద్యోగాలే లక్ష్యం

● టీడీపీ నగర అభ్యర్థి పొంగూరు నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 30 : చదువుకున్న యువత అందరికీ ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని మాజీ మంత్రి, టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. మంగళవారం 3వ డివిజన్‌లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా యువత భవిష్యత్‌పై ప్రత్యేక దృష్టి సారించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. గతంలో టీడీపీ పాలనలో అభివృద్ధి పనులు దాదాపు 90 శాతం పూర్తవగా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ పనులను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. మరలా టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మిగిలిపోయిన పనులన్నీ వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం నెల్లూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి వారికి అండగా నిలుస్తామన్నారు. ప్రజలంతా టీడీపీకి మద్దతిచ్చి ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి తనను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. అలాగే నగరంలోని 13వ డివిజన్‌లో నారాయణ సతీమణి రమాదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నారాయణ కుమార్తె శరణి 11వ డివిజన్‌లో ఇంటింట ప్రచారం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే నారాయణను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డిని గెలిపించాలని కోరారు. 45, 46 డివిజన్లలో నారాయణ కుమార్తె సింధూర ప్రచారం చేశారు.

● సీఎం జగన్మోహన్‌రెడ్డి విడుదల చేసిన వైసీపీ మేనిఫెస్టోపై పొంగూరు నారాయణ స్పందించారు. టీడీపీ మేనిఫెస్టోకి, వైసీపీ మేనిఫెస్టోకి చాలా తేడా ఉందన్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పుణ్యమా అని పేదలంతా పూర్తిగా చితికిపోయారన్నారు. అన్ని వ్యవస్థలు దెబ్బతిన్నాయని, పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. ఇవన్నీ ఆలోచించే నిరుపేదలందరూ ఆర్థికంగా ఎదగాలన్న మంచి ఉద్దేశంతో చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను తీసుకువచ్చారని తెలిపారు.

● తెలుగుదేశం పార్టీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. నగరంలోని గోమతినగర్‌లో ఉన్న నారాయణ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నగర నియోజకవర్గంలోని పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. అబ్దుల్ ఖలీల్ నేతృత్వంలో పార్టీలో చేరిన వారికి నారాయణ కండువాలు కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ పాలనలో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.



ఎన్నికల ప్రచారంలో మహిళల సమస్యలు తెలుసుకుంటున్న నారాయణ

### న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

● వీపీఆర్, నారాయణ

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 30 : ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న న్యాయవాదుల సమస్యలను తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని ఆ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం వారు నెల్లూరు న్యాయవాదుల బార్ అసోసియేషన్‌ను సందర్శించి ఓటు అభ్యర్థించారు. ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాల వల్ల ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, ఈ ప్రభుత్వాన్ని ఓటు అనే ఆయుధంతో ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. కొత్తగా అమల్లోకి తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ 2022 వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ యాక్ట్ వల్ల కలిగే నష్టాలపై రాజకీయ పక్షాల కంటే న్యాయవాదులే ఎక్కువగా పోరాటం చేశారంటూ లాయర్లను అభినందించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తుందని హామీ ఇచ్చారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాల విషయాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ఎం సుభానీ, ప్రధాన కార్యదర్శి ఎం సుందరయ్య యాదవ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డితోపాటు అత్యధిక సంఖ్యలో న్యాయవాదులు, టీడీపీ, బీజేపీ, జనసేన లీగల్ సెల్ నాయకులు పాల్గొన్నారు.



న్యాయవాదులతో సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

## పాత గొడవల వల్లే యువకుడి హత్య

● నిర్ధారించిన పోలీసులు

● లొంగిపోయిన నిందితులు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 30: పాత గొడవలను మనసులో పెట్టుకొని యువకుడిని ముగ్గురు వ్యక్తులు కలిసి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు విచారణలో తేల్చారు. నిందితులు మంగళవారం వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో వీఆర్వో సమక్షంలో లొంగిపోయారు. వారి వివరాలను నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.

నగరంలోని బీవీనగర్ రైల్వే గేటు సమీపంలో గల విఘ్నేశ్వర ఆలయం వీధిలో పీ రామ య్య, నాగమణి దంపతులు నివసిస్తున్నారు. వారికి దశరథ్(28), మేఘనాథ్ కుమారులు. మేఘనాథ్ వివాహమై వేరుగా కాపురం ఉంటుండగా, దశరథ్ తల్లిదండ్రులతో ఉంటున్నాడు. అతను తాతతో కలిసి పుచ్చకాయల వ్యాపారం చేస్తున్నాడు. ఇదిలా ఉండగా పాత వేదాయ పాళెం ప్రాంతానికి చెందిన గుంజి రవి అలియాస్ కత్తి రవికి, దశరథ్‌కు 2016 నుంచి గొడవలున్నాయి. అప్పట్లోనే దశరథ్‌పై రవి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దశరథ్ పోలీసు కేసు పెట్టడంతో అతనిపై రవి కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా అంతమొందించాలని సమయం కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు. ఈ క్రమంలో గత నెల 22వ తేదీ సాయంత్రం దశరథ్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అదేరోజు రాత్రి 11.30 గంటల సమయంలో రవి అతని స్నేహితులు వడ్డేపల్లి వెంకటేష్ అలియాస్ వెంకీ అలియాస్ డాన్ వెంకీ, షస్రక్ అమీర్ బాషా అలియాస్ అమీర్ కలిసి మద్యం సేవిస్తుండగా దశరథ్ ఒంటరిగా వెళ్లడం గమనించారు. అతడిని హత్య చేసేందుకు అదే సరైన సమయంగా భావించారు. దశరథ్‌ను పిలిచి మాటలు కలిపారు. బైక్‌పై ఆటోనగర్ పడమర వైపు ఉన్న అయ్యల్‌రెడ్డి లే అవుట్ ఖాళీ ప్లాట్లలోకి తీసుకువెళ్లారు. కాళ్ల మడిమలు, చేతుల మణికట్టు నరకడమేకాక విచక్షణారహితంగా గుండెల్లో కత్తితో పొడిచారు. కత్తి ఛాతీలో చిక్కుకుపోయి తీవ్ర రక్తస్రావం కావడంతో దశరథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ తర్వాత నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. 23వ తేదీ ఉదయం స్థానికుల సమాచారంతో వేదాయపాళెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. దశరథ్ తల్లి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పాత గొడవల కారణంగా ముగ్గురు వ్యక్తులు దశరథ్‌ను హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈ కేసును ఛేదించిన పోలీసులను డీఎస్పీ శ్రీనివాస రెడ్డి అభినందించారు.

## గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (వీఆర్సీ), ఏప్రిల్ 30 : జిల్లాలో ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల విద్యాల యాల్లో 2024- 25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో డాక్టర్ రాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 3వ తరగతిలో ప్రవేశాలతోపాటు 4 నుంచి 9 వరకు తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తారని తెలిపారు. 3వ తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇతర కులాల వారికి రిజర్వేషన్ కల్పిస్తారన్నారు. ఐటీడీఏ పరిధిలో బాలురకు కొడవలూరు, నాయుడుపేట, కావలి, సర్వేపల్లి, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, గూడూరులో గురుకులాలు ఉన్నాయన్నారు. బాలికలకు నెల్లూరు, కోట, గూడూరు, రాపూరు, వెంకటగిరి, కావలి, కరేడులో గురుకుల పాఠశాలలు ఉన్నాయని, వీటిలో 4నుంచి 9వ తరగతి వరకు అన్ని కేటగిరిలలో ఉన్న ఖాళీ సీట్లు భర్తీ చేస్తామని వివరించారు. పూర్తి వివరాలకు ఐటీడీఏ కార్యాలయంలోగానీ, ఆయా గురుకులాల ప్రిన్సిపాళ్లనుగానీ సంప్రదించాలని కోరారు.

## వేదగిరి ఆదాయం రూ. 11.12 లక్షలు

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 30 : వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రూ. 11,12,046 ఆదాయం లభించినట్లు ఈవో గిరికృష్ణ తెలిపారు. ఆలయంలో మంగళవారం హుండీల లెక్కింపు జరిగింది. 119 రోజులకుగాను భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.11.12 లక్షలు వచ్చినట్లు చెప్పారు. అన్నదానం హుండీకి రూ.21,708 అదనంగా వచ్చిందని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని స్వామి వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్లు వెల్లడించారు.

## రేపు రెజ్లింగ్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 30 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం అండర్-17, 23 జిల్లా స్థాయి బాల, బాలికల రెజ్లింగ్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పుట్టా వెంకట అజయ్‌కుమార్, పీ నాగేంద్రరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన జట్లు చిత్తూరు జిల్లాలో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు సంబంధిత తేదీలో ఉదయం 10 గంటలకు ఎంపికకు హాజరు కావాలని కోరారు.



# సూపర్ సిక్స్‌కు అదనంగా
# మరిన్ని మేళ్లు!

## టీడీపీ,జనసేన,బీజేపీ కూటమి మేనిఫెస్టోకు అనూహ్య స్పందన
## పోలింగుపై అమిత ప్రభావం చూపే అవకాశం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతోనే జిల్లాలోని వివిధ వర్గాలకు రూ. 4 వేల కోట్లకు పైగా లబ్ధి కలగనుండగా.... తాజాగా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విడుదల చేసిన ఉమ్మడి మేనిఫెస్టోతో అదనంగా మరిన్ని మేళ్ళు జరగనున్నాయి. ప్రత్యేకించి పలు వర్గాలకు విశేషమైన లబ్ధి చేకూరనుంది. దీంతో ఈ మేనిఫెస్టో పట్ల జిల్లావ్యాప్తంగా అన్ని వర్గాల్లోనూ విశేష స్పందన కనిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో అమితంగా ప్రభావం చూపనున్న ఈ మేనిఫెస్టోలో వివిధ వర్గాలకు మంచి చేసే పథకాలు, కార్యక్రమాల హామీలుండగా మచ్చుకు కొన్నింటిని ఎంచుకుని జిల్లా ప్రజలకు కలిగే మేలును వివరించే ప్రయత్నమిది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



### అభివృద్ధి, సంక్షేమాల్లో అగ్ర తాంబూలం మహిళలకే!

ఎన్డీయే కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో లబ్ధి పొందే వర్గాల్లో మహిళలదే అగ్రస్థానం. జిల్లాలో సుమారుగా 11 లక్షల మంది మహిళలున్నారు.ఇందులో 19ఏళ్ళ నుంచీ 59ఏళ్ళ లోపు వయసున్న వారి సంఖ్య ఇంచుమించు 7.70 లక్షలుంటుందని అంచనా.వీరికి నెలనెలా రూ. 1500 చొప్పున నెలకు రూ.115.50 కోట్లు, ఏడాదికి రూ. 1386 కోట్లు చొప్పున ఐదేళ్ళకు రూ. 6930 కోట్లు లబ్ధి కలగనుంది. వ్యక్తిగతంగా ఒక్కొక్కరికీ ఏడాదికి రూ. 18 వేలు, ఐదేళ్ళకు రూ. 90 వేల వంతున అందనుంది. అమ్మఒడి తరహాలోనే అయితే కుటుంబానికి ఒక విద్యార్థికి కాకుండా స్కూలు పిల్లలు ఎందరుంటే అందరికీ ఏడాదికి రూ. 15 వేల వంతున అందనుంది. జిల్లాలో సుమారు 8 లక్షల మందికి పైగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కలగనుంది. మహిళలకు నైపుణ్యాల శిక్షణతో పాటు చిన్న మధ్య తరహా పరిశ్రమలు,అంకుర సంస్థలు పెట్టాలనుకునే ఔత్సాహికులకు ప్రాజెక్టు వ్యయంలో గరిష్ఠంగా రూ. 10 లక్షలు సబ్సిడీ అందనుంది.

### వడ్డీలేని రుణాల పరిమితి పెంపుతో 4.73 లక్షలమంది మహిళలకు అదనపు లబ్ధి

గ్రామీణ ప్రాంతాల్లో 34,131 స్వయం సహాయక మహిళా సంఘాలు, పట్టణ ప్రాంతాల్లో 11,728 సంఘాలు వుండగా వాటికి ఇపుడున్న వడ్డీ లేని రుణ పరిమితి రూ. 3 లక్షల నుంచీ ఏకంగా రూ. 10 లక్షలకు పెరగనుంది. దానివల్ల గ్రామీణ సంఘాల్లోని 3.54 లక్షలమంది మహిళలకు, పట్టణ సంఘాల్లోని 1.18 లక్షలమంది చొప్పున మొత్తం 45,859 సంఘాల్లోని 4.73 లక్షలమంది సభ్యులకు అదనపు మేలు జరగనుంది.

### అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు ఊరట

అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ చెల్లింపులు జరుపుతామని, ఆశా వర్కర్లకు గౌరవ వేతనం పెంచుతామని మేనిఫెస్టోలో ఎన్డీయే కూటమి ప్రకటించింది. దీనివల్ల జిల్లాలోని 2425మంది అంగన్‌వాడీ వర్కర్లకు, 2041 మంది హెల్పర్లకు ఊరట కలగనుంది. అదేవిధంగా జిల్లాలోని 1705 మంది ఆశా వర్కర్లకు కూడా వేతనాలు పెరిగేందుకు అవకాశముంది. ఉద్యోగాలు చేసుకునే మహిళలకు ప్రత్యేకంగా వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ళు ఏర్పాటు చేయనుంది.

### బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు విశేష లబ్ధి

జనాభాలో అధికంగా వున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, క్రిస్టియన్లకు ఎన్డీయే కూటమి కనుక అధికారంలోకి వస్తే విశేషమైన లబ్ధి కలగనుంది.50ఏళ్ళ నుంచే పెన్షను అందనుంది. జిల్లాలో సుమారు 5.72 లక్షల మంది బీసీలుండగా ఇంచుమించు 2.50 లక్షల మందికి నెలనెలా రూ.4వేల చొప్పున పెన్షన్ లభించే అవకాశముంది. అలాగే 3.50 లక్షలమంది ఎస్సీలుండగా వారిలో 1.50 లక్షల మందికి పెరిగిన పెన్షన్ అందనుంది. ఎస్టీలు సుమారు 2 లక్షలమంది వుండగా వారిలో కూడా 80 వేలమంది దాకా పెన్షన్ పొందే వీలుంది.ఇక మైనారిటీలు 2.50 లక్షలుండగా 1.30లక్షలమంది వరకూ పెన్షన్ తీసుకునేందుకు ఆస్కారముంది.అదే విధంగా హజ్ యాత్రకు వెళ్ళే ముస్లింలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందనుంది.ప్రతి మసీదుకూ నెలనెలా నిర్వహణకు రూ.5వేల సాయం అందుతుంది. ఇమామ్‌లకు రూ. 10వేలు, మౌజన్‌లకు రూ. 5వేల వంతున గౌరవ వేతనం లభించనుంది. క్రిస్టియన్లకు కూడా జెరూసలెం యాత్రకు ఆర్థికసాయం అందే అవకాశం వుంది.



### రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్న గాలేరు-నగరి

గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ రైతాంగంలో ఆశలు రేకెత్తిస్తోంది. శ్రీకాళహస్తి,సత్యవేడు, నగరి నియోజకవర్గాల్లోని పలు మండలాలకు సాగు, తాగునీటిని అందించే ఈ ప్రాజెక్టు గత టీడీపీ ప్రభుత్వంలో పురోగతికి నోచుకోగా ప్రస్తుత ప్రభుత్వం టెండర్లు కూడా రద్దు చేసి పనులు ఆపేసిన సంగతి తెలిసిందే. ఐదేళ్ళుగా ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయిన స్థితిలో రైతులు ఈ ప్రాజెక్టుపై ఆశలు వదిలేసుకున్నారు. ఈ తరుణంలో టీడీపీ మిత్రపక్షాలతో ప్రాజెక్టు పూర్తికి హామీ ఇవ్వడంతో రైతుల్లో తిరిగి ఆశలు మొలకెత్తుతు న్నాయి. అలాగే గతంలో జిల్లాలోని మెట్ట రైతులకు ఎంతో మేలు చేసిన 90శాతం సబ్సిడీతో డ్రిప్ సదుపాయాన్ని తిరిగి అమలు చేస్తామని ఎన్డీయే కూటమి ప్రకటించడం పట్ల రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకాన్ని కూడా నిలిపేసిన సంగతి తెలిసిందే.

### కూటమి వైపు యువత చూపు

టీడీపీ కూటమి మేనిఫెస్టోలో యువతకు అమిత ప్రాధాన్యత ఇచ్చింది. ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు ఫీజులను నేరుగా కాలేజీలకు చెల్లించనున్నారు. అలాగే నిరుద్యోగ యువతకు జిల్లాలో కనీసం లక్ష ఉద్యోగాలు ప్రైవేటు రంగంలో లభించనున్నాయి.అలా లభించే వరకూ నిరుద్యోగ యువతకు భృతి కింద నెలకు రూ.3వేలు చెల్లించనున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీతో పాటు ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామ న్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎంఎస్ఎంఈ లలో ప్రోత్సాహం అందించనుంది. నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు పనికొచ్చేలా డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు కానున్నాయి.వీటన్నింటికీ మించి గంజాయి, డ్రగ్ మాఫియాపై వంద రోజుల్లో కఠిన చర్యలు తీసుకుంటామన్న హామీతో తిరుపతి వంటి గంజాయి ప్రభావం అధికంగా వున్న ప్రాంతాలకు మేలు జరగనుంది.



## సంక్షేమ పథకాల వరద!

ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడితే జిల్లాలో సంక్షేమ పథకాలు వరదలా లబ్ధిదారులను ముంచెత్తడం ఖాయమనిపిస్తోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ కానుకలను పునరుద్ధరించనున్నారు.అలాగే పేద వర్గాలకు చెందిన యువతుల వివాహాల సందర్భంగా కళ్యాణమస్తు, షాదీ తోఫా పేర్లతో అందజేసే పెళ్లి కానుకలను కూడా తిరిగి అమలు చేయనున్నారు. డ్రైవర్ల కార్పొరేషన్ ఏర్పాటు, అందరు డ్రైవర్లకూ ప్రమాద బీమా, ఆరోగ్య బీమాలతో పాటు ఏటా రూ. 15 వేల ఆర్థిక సాయం, జీవో 21 రద్దు, జరిమానాల భారం తగ్గింపు, గ్రీన్ ట్యాక్స్ తగ్గింపు వంటి హామీలు వాహన రంగంలోని డ్రైవర్లకు అమిత మేలు చేకూర్చనున్నాయి.పేద కుటుంబాలకు చంద్రన్న బీమా పథకం ద్వారా సహజ మరణానికి రూ. 5లక్షలు, ప్రమాద మరణానికి రూ.10లక్షల చొప్పున చెల్లించనున్నారు. దివ్యాంగులకు రూ. 6 వేలు, పూర్తి వైకల్యం వున్న వారికి రూ. 15 వేలు, కిడ్నీ, తలసేమియా వ్యాధిగ్రస్తులకు నెలకు రూ. 10 వేల చొప్పున పెన్షన్లు పెంచి అందించనున్నారు. పేదలకు పట్టణాల్లో 2సెంట్లు, గ్రామాల్లో 3సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు ఇవ్వడంతో పాటు ఇప్పటికే మంజూరైన స్థలాల్లో ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నారు.

### ఉద్యోగులకు తీపి కబురు

ఎన్డీయే కూటమి మేనిఫెస్టో జిల్లాలోని ఉద్యోగులకు తీపి కబురు అందించింది. జిల్లాలోని 26,671మంది ఉద్యోగులకు ఐఆర్ అందడంతో పాటు ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు అందనున్నాయి.అలాగే పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వల్ల జిల్లాలోని 17 వేల మంది పెన్షనర్లకు కూడా నెలనెలా 1వ తేదీనే పెన్షన్లు అందించనున్నారు. జిల్లాలోని 1272మంది కాంట్రాక్టు, 3700 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలన్నీ వర్తించనున్నాయి.అలాగే జిల్లాలోని 11వేలమంది వలంటీర్లకు గౌరవ వేతనం రెట్టింపు కానుంది. ఇపుడు వైసీపీ ప్రభుత్వం రూ. 5 వేలు ఇస్తుండగా అది రూ. 10 వేలకు పెరగనుంది. అలాగే పాడి రైతులకు మేలు చేసే గోపాల మిత్రలను తిరిగి నియమించనున్నారు.

### పట్టణాల్లో మళ్ళీ అన్నా క్యాంటీన్లు

టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే అన్నా క్యాంటీన్లు తిరిగి ఏర్పాటు కానున్నాయి.అదే జరిగితే తిరుపతి నగరంతో పాటు శ్రీకాళహస్తి, పుత్తూరు, నాయుడుపేట, సూళ్ళూరుపేట,గూడూరు,వెంకటగిరి పట్టణాల్లో పేదలకు, రోజు కూలీలకు, పేద విద్యార్థులకు, రోగులకు, వారి సహాయకులకు ఎంతో మేలు జరగనుంది.

## రేపు చంద్రగిరిలో హలో....లోకేష్ కార్యక్రమం

చంద్రగిరి, ఏప్రిల్ 30: చంద్రగిరి మండలంలోని అగరాల సమీపంలో గురువారం సాయంత్రం హలో లోకేష్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిలో అగరాల సమీపంలోని నారాయణ కళాశాల ఎదురుగా ఉన్న స్థలంలో గురువారం సాయంత్రం 3గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి హాజరు కానున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువతనుద్దేశించి ప్రసంగించనున్నారు.టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆధ్వర్యంలో సభాస్థలంలో కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.బుధవారం రాత్రికే లోకేష్ తిరుపతికి చేరుకోనున్నారు.

## వరదల సమయంలో కన్పించలేదే?

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కిలివేటిని నిలదీసిన కట్టువపల్లివాసులు



దొరవారిసత్రం, ఏప్రిల్ 30: 'మా గ్రామానికి మీరు ఏం చేశారు... తుఫాన్ సమయంలో వరదలు వస్తే కనీసం మా వైపు చూడలేదు... మాకెందుకు వరద బియ్యం ఇప్పించలేదు... గతంలో జగన్ సీఎం కాలేదు అని చెప్పావు...జగన్ సీఎం అయ్యాక ఈ ఐదేళ్లు మా ఊరిని ఏం అభివృద్ధి చేశావు' అంటూ సూళ్లూరుపేట వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్యను కట్టువపల్లి గ్రామస్తులు నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కిలివేటి దొరవారిసత్రం మండలం కట్టువపల్లికి మంగళవారం వెళ్లారు.గ్రామాన్ని అభివృద్ధి చేయలేదని, పథకాలు అందరికీ అందలేదంటూ గ్రామస్తులు ప్రశ్నించారు. అయితే ఎమ్మెల్యే సంజీవయ్య ప్రభుత్వ పథకాలను వల్లెవేస్తూ అర్హులందరికీ ఈ పథకాలు అందాయని చెప్పుకొచ్చారు. అర్హత లేని వారికే పథకాలు అంది ఉండవంటూ ముందుకు కదిలారు.



### వడదెబ్బతో మహిళ మృతి



మల్లాపు పుట్టమ్మ (ఫైల్ ఫొటో)

వాకాడు, ఏప్రిల్ 30:వడదెబ్బతో మరొకరు మృతి చెందారు.వాకాడు మండలం నిడిగుర్తి పంచాయతీ పరిధిలోని బాలాజీనగర్‌కు చెందిన మల్లాపు పుట్టమ్మ(52) మంగళవారం వేరుశనగ చేనులో పనిచేస్తున్న భర్తకు మధ్యాహ్నాం భోజనం తీసుకువెళ్లింది. తిరిగి వస్తుండగా ఎండ తీవ్రతకు ఒక్కసారిగా కుప్పకూలింది. గమనించిన గ్రామస్తులు సమాచారం అందజేయగా కుటుంబసభ్యులు పుట్టమ్మను ఆస్పత్రికి తరలించారు.అయితే మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందింది.

## రుయాలో ఆరు నెలల చిన్నారికి కిడ్నీ శస్త్ర చికిత్స



కోలుకున్న బాలుడితో వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 30: రుయాస్పత్రిలో ఆరు నెలల చిన్నారికి కిడ్నీ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. వివరాలను మంగళవారం సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు మీడియాకు తెలిపారు. చిత్తూరు జిల్లా ఎస్ఆర్‌పురం మండలానికి చెందిన కౌశిక్ బాబు అనే ఆరు నెలల బాలుడు.. పుట్టినప్పటి నుంచే కిడ్నీ అడ్డం తిరిగి బాధపడుతున్నాడు. వారం కిందట సమస్య ఎక్కువ కావడంతో తల్లిదండ్రులు రుయా చిన్నపిల్లల విభాగానికి బాలుడిని తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి, కిడ్నీలో చీము చేరి.. పరిస్థితి విషమంగా ఉన్నట్లు గుర్తించారు. వెంటనే నిపుణులైన డాక్టర్ జగదీష్, డాక్టర్ రాజ్‌కిరణ్, డాక్టర్ మనోహర్‌లు బాలుడికి అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సను చేశారు. చీమును తొలగించడంతోపాటు కిడ్నీని సరైన క్రమంలో అమర్చారు. ఇటువంటి సర్జరీ ఇప్పటి వరకు రుయాస్పత్రిలో చేయలేదని ఇదే మొదటిదని, వైద్యబృందాన్ని రవిప్రభు అభినందించారు.ఇటువంటి సర్జరీ కార్పొరేటు ఆస్పత్రుల్లో చేయాలంటే రూ.లక్షలు ఖర్చవుతాయని చెప్పారు.

## నగదు, మద్యం అక్రమ రవాణాపై నిఘా పంచాలి

నెల్లూరు (హరనాథపురం) : నగదు, మద్యం అక్రమ రవాణాపై నిఘా పెంచాలని కలెక్టర్ హరినారాయణన్ నోడల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నోడల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. చెక్ పోస్టుల్లో సీజ్ చేసిన నగదును డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ కమిటీ వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలన్నారు. ఎన్నికల విధులు కేటాయించిన అధికారులకు, సిబ్బందికి వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని పేర్కొన్నారు. సీవిజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులన్నిటినీ పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఒక వైపు పోర్టు, మరోవైపు రైల్వే వ్యవస్థ.. వీటికి మధ్యలో జాతీయ రహదారి. అన్నింటికన్నా మించి అందుబాటులో భారీ భూబ్యాంక్, మానవ వనరులు.. ఇన్ని వసతులు ఉన్నప్పుడు పారిశ్రామిక రంగం ఏ విధంగా పరుగులు తీయాలి? కానీ గడిచిన ఐదేళ్లలో జిల్లాలో జరిగిన పారిశ్రామిక ప్రగతిని పరిశీలిస్తే ప్రభుత్వ వైఫల్యం ఏ విధంగా ఉందో స్పష్టంగా అర్థమవుతుంది. కొత్త పరిశ్రమలు రావడం అటువంచితే అప్పటికే ఏర్పాటుకు సుముఖత చూపిన భారీ పరిశ్రమలు కూడా పరార్ అవ్వడం ప్రభుత్వ తీరుకు అద్దం పడుతోంది. భూములు ఇచ్చిన రైతులు, నిరుద్యోగ యువత ఉపాధి కోసం కళ్లల్లో ఒత్తులేసుకొని ఎదురు చూసి నా చివరకు నిశారే ఎదురైంది.

# ఉన్నవి పాయె.. కొత్తవి రాకపాయె..!

- ఐదేళ్లలో పడకేసిన పారిశ్రామిక రంగం

- అవకాశాలను అందిపుచ్చుకోని ప్రభుత్వం
- వైసీపీ ప్రభుత్వంలో రూ.1317 కోట్ల పెట్టుబడులు
- ఉత్కర్ష, క్రిబ్‌కో ఎటు పోయనో..!
- మోసపోయిన నిరుద్యోగులు
- టీడీపీ ప్రభుత్వంలో రూ.19,704 కోట్ల పెట్టుబడులు








నెల్లూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో పారిశ్రామిక ప్రగతి తిరోగమనంలో పయనించింది. 2014-19 మధ్య కాలానికి, 2019-24 మధ్య కాలానికి పోలిక చూసుకుంటే భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో జిల్లాలో 12 భారీ, మెగా పరిశ్రమలు ఏర్పడ్డాయి. రూ.19,704 కోట్లతో ఏర్పాటైన ఈ పరిశ్రమల ద్వారా 4,734 మందికి ప్రత్యక్షంగా ఉపాధి దొరికింది. పరోక్షంగా మరో ఐదు వేల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.9,259 కోట్ల పెట్టుబడులతో భారీ, మెగా పరిశ్రమలు ఏర్పాటు కాగా 1,563 మందికి ఉపాధి లభించినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. అయితే ఇందులో రూ.7,942 కోట్ల పెట్టుబడులు కృష్ణపట్నం థర్మల్ ప్లాంటు మూడో యూనిట్ ఉండటం గమనార్హం. ఇది రాష్ట్ర ప్రభుత్వ సంస్థ కాగా ఈ పనులు కూడా గత ప్రభుత్వంలోనే ప్రారంభమయ్యాయి. అలానే రూ.273 కోట్లతో ఓ పరిశ్రమ, రూ.88 కోట్లతో మరో పరిశ్రమ 2019లో ప్రారంభం కాగా అవి టీడీపీ ప్రభుత్వంలో మొదలైనవేనని అధికారులు చెబుతున్నారు. దీనిని బట్టి వైసీపీ ప్రభుత్వంలో పరిశ్రమల ప్రగతి ఎంత దారుణంగా ఉందో స్పష్టమవుతోంది. ఇక 2014-19 మధ్య కాలంలో సింగిల్ విండో ఇండస్ట్రియల్ పాలసీని తీసుకొచ్చి వేగవంతంగా పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారు. జిల్లాలో మూడు ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి సేల్ డీడ్ రూపంలో విక్రయాలు చేయడంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చారు. దీంతో టీడీపీ ఐదేళ్ల కాలంలో 2,602 ఎంఎస్ఎంఈలు రూ.677 కోట్లతో ఏర్పాటు కాగా 12,465 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించింది.

### కొంపముంచిన 'సేల్ డీడ్'

వైసీపీ ప్రభుత్వంలో ఇండస్ట్రియల్ పాలసీను మార్చి భూములను సేల్ డీడ్ విధానంలో కాకుండా లీజు విధానానికి మార్చడంతో ఔత్సాహికులు వెనకడుగు వేశారు. ఒక్కరంటే ఒక్కరు కూడా ఇండస్ట్రియల్ పార్కుల్లో పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు రాలేదు. తప్పు తెలుసుకున్న వైసీపీ ప్రభుత్వం ఇటీవల లీజు డీడ్ విధానం మార్చుకొని మళ్లీ సేల్ డీడ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కాగా కొవిడ్ రూపంలో ఎంఎస్ఎంఈలకు భారీ కష్టం వచ్చి పడింది. అప్పటివరకూ ఎంఎస్ఎంఈల కింద రిజిస్ట్రేషన్ చేసుకోని వారు తీవ్రంగా నష్టపోయారు. ఎంఎస్ఎంఈలకు పెట్టుబడి సాయం చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఇప్పటివరకూ రిజిస్ట్రేషన్ చేసుకోని చిన్న చిన్న పరిశ్రమలన్నీ రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. 14 వేలకు పైగా ఎంఎస్ఎంఈ కింద రిజిస్ట్రేషన్ చేసుకోగా అవన్నీ వైసీపీ ప్రభుత్వంలో కొత్తగా ఏర్పాటైనవన్నట్లుగా ప్రచారం చేసుకుటుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### భారీ పరిశ్రమలు పరార్

జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు తెలుగుదేశం ప్రభుత్వం ఎంతో కష్టపడింది. కీలకమైన మిథానీ, క్రిబ్కో వంటి కేంద్ర సంస్థలకు జిల్లాలో భూములు కూడా కేటాయించింది. కానీ వైసీపీ ప్రభుత్వంలో ఆ పరిశ్రమలు పరారయ్యాయి. కొడవలూరు మండలం బొడ్డువారిపాలెం వద్ద రక్షణ పరికరాలు తయారు చేసే మిథానీ సంస్థ రూ.3,500 కోట్లతో భారీ ప్లాంటును దక్షిణ భారత దేశంలో మొదటిసారి ఏర్పాటు చేసేందుకు టీడీపీ ప్రభుత్వంలో ముందుకొచ్చింది. 2018లో 110 ఎకరాల భూమిని కూడా అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఈ భూమిపై కొందరు కోర్టుకెళ్లడంతో అప్పట్లో పనులు ప్రారంభం కాలేదు. అయితే ఆ తర్వాత కోర్టు కేసు తొలగిపోయింది. ఈ లోపు ప్రభుత్వం కూడా మారిపోయింది. ఈ క్రమంలో మిథానీ సంస్థ రక్షణ పరికరాల తయారీ పరిశ్రమ ఏర్పాటు ఆలోచనను విరమించుకుంది. ఆ స్థానంలో మిథానీ, నాల్కో జాయింట్ వెంచర్‌గా ఏర్పాటైన ఉత్కర్ష అల్యూమినియం ధాతు నిగమ్ లిమిటెడ్ సంస్థ హైఎండ్ అల్యూమినియం ఉత్పత్తులు తయారీకి ముందుకొచ్చింది. 2020లో మిథానీ పేరు మీద ఉన్న భూములను ఉత్కర్ష పేరుపైకి మార్చారు. అయినప్పటికీ ఆ సంస్థ ఆ తర్వాత ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. 2022 ఏప్రిల్‌లో ఉత్కర్ష సంస్థ ఉన్నతాధికారులు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి సమస్యలపై చర్చించారు. అయినా పురోగతి లేదు. ప్రస్తుతం ఉత్కర్ష సంస్థ జిల్లాలో పరిశ్రమ ఏర్పాటు ఆలోచనను విరమించుకున్నట్లు ఉన్నతాధికారుల ద్వారా తెలుస్తోంది. వెంకటాచలం మండలం సర్వేపల్లి వద్ద క్రిబ్కో ఎరువుల పరిశ్రమ ఏర్పాటు తెలుగుదేశం ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. రూ. వెయ్యి కోట్లతో ఏర్పాటు చేయాలని భావించిన ఈ పరిశ్రమకు భూమి కూడా కేటాయించింది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎరువుల పరిశ్రమ ఆలోచనను క్రిబ్కో వెనక్కు తీసుకుంది. ఈ ప్లాంటు తమిళనాడులో ఏర్పాటు చేసేందుకు ఆలోచనలు జరుగుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు రావడంతో కేంద్ర మంత్రితో ఎంపీలు సంప్రదింపులు జరిపారు. ఆ తర్వాత క్రిబ్కో ఎరువుల పరిశ్రమ స్థానంలో బయో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు జరగనున్నట్లు ప్రకటించారు. కానీ అది కూడా కార్యరూపం దాల్చలేదు. ఇక రామాయపట్నంలో ఏషియన్ పేపర్ సంస్థ భారీ పరిశ్రమ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వంలో ఒప్పందం జరిగింది. కానీ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ పరిశ్రమ ఊసే కనిపించలేదు.

### సీఎం జిల్లాకు 'సెంచురీ' జంప్

ఆత్మకూరు : మండలంలోని నారంపేట వద్ద 2020, సెప్టెంబరు 20న 173 ఎకరా ల్లో ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటైంది. ఇక ఆత్మకూరు పారిశ్రామికంగా అడుగులు వేస్తుందని ప్రజలు ఎంతగానో సంబరపడ్డారు. పార్కు అభివృద్ధి కోసం తొలిగా రూ.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో 87 ఎకరాల్లో మాత్రం రోడ్లు, డ్రైనేజీ పనులు జరిగాయి. కొన్నాళ్లకు ఈ పార్కులో సెంచరీ ప్లైవుడ్ పరిశ్రమకు శ్రీకారం చుట్టారు. కానీ ఏమి జరిగిందో ఏమో ఈ పరిశ్రమ ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లాకు తరలిపోయింది. 2021, డిసెంబరున బద్వేల్ నియోజకవర్గంలో సదరు పరిశ్రమ ఏర్పాటుకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. వచ్చిన ఒక్క పరిశ్రమ కూడా తరలిపోవడంతో నారంపేట వద్ద పార్కు నిరుపయోగంగా మారింది. ఆత్మకూరులో సెంచరీ ప్లైవుడ్ పరిశ్రమ ఏర్పాటు చేసి ఉంటే రూ.1600 కోట్లు పెట్టుబడులు, 2500 పైచిలుకు ప్రత్యక్ష ఉద్యోగాలు, మరో 500 మందికి ఉపాధి లభించి ఉండేది. పరిశ్రమ తరలిపోవడంతో నిరాశే మిగిలింది.



ఆత్మకూరు : పిచ్చిమొక్కలతో నిండిన ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటుకు కేటాయించిన స్థలం

## పేరొకటే.. ఇంటి పేర్లు తేడా !

- ఆత్మకూరు బరిలో ముగ్గురు పోటీ
- పార్టీ గుర్తుపై ఇద్దరు.. ఇండిపెండెంట్ ఒకరు

ఆత్మకూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసేవారిలో రామనారాయణరెడ్డి పేరుతో ముగ్గురు ఉన్నారు. వీరిలో ఇద్దరు పార్టీ గుర్తుపై కాగా, ఒకరు ఇండిపెండెంట్. టీడీపీ తరుపున ఆనం రామనారాయణరెడ్డి సైకిల్ గుర్తుపై పోటీ చేస్తున్నారు. అనంతసాగరం మండలం బీ అగ్రహారం గ్రామానికి చెందిన ధనిరెడ్డి రామనారాయణరెడ్డి జాతీయ జనసేన పార్టీ తరపున పెన్‌స్టాండ్ గుర్తుపై పోటీలో ఉన్నారు. అలాగే చేజర్ల మండలం మడపల్లి గ్రామానికి చెందిన సాగసాయి రామనారాయణరెడ్డి ఇండిపెండెంట్‌గా గ్లాస్ గుర్తుపై పోటీలో ఉన్నారు. కాగా అక్షరాస్యులు సైతం ఈ పేర్లు చూసి గందర గోళానికి గురయ్యే అవకాశం ఉందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే వైసీపీ చేసిన దుర్మార్గపు ఆలోచన ఇదని టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

- సంగం



## అప్పట్లో డబ్బు ప్రభావం ఉండేది కాదు..


నేటి తరం రాజకీయాల్లో నీతి,నిబద్ధత లేదు. మా రోజుల్లో ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ప్రజాసేవ చేశాం. 30ఏళ్ల రాజకీయాల్లో క్రియాశీలకంగా పని చేశా. 3 సార్లు కౌన్సిలర్‌గా పనిచేశా. ఏ ఎన్నికలైనా డబ్బు ప్రభావం ఉండేది కాదు. నేడు డబ్బు ఏరులై పారుతోంది. సామాన్యులు ఎన్నికలకు దూరంగా ఉండాల్సిందే. ఆరోజుల్లో కార్యకర్తలకు ఎంతో విలువుండేది. నాయకుడ్ని కార్యకర్త నడిపించే వాడు. నేడు కార్యకర్తలను కూలీలుగా మార్చా రు. కార్పొరేట్ రాజకీయాలు నడుస్తున్నాయి కార్యకర్తలు టికెట్ తెచ్చుకున్నవారిని అనుసరించడం తప్ప, చేసేదేమి లేక సర్దుకుంటున్నారు.

- సయ్యద్ అరబ్ బాల్వి, మాజీ కౌన్సిలర్, కావలి

## గీత దాటితే వేటు

నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో బరిలో ఉండేవారు ఎవరో తేలిపోయింది. ఇక ప్రచారాలు ఊపందుకోనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల కార్యకర్తలు నిబంధనలు మరచిపోయి అత్యుత్సాహం ప్రవర్శిస్తుంటారు. ఎన్నికల సంఘం ప్రచారానికి స్పష్టమైన గీత గీచింది. ఆ గీత దాటితే వేటు వేయనున్నది. అవేమిటంటే ప్రచార వాహనాలకు రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలి. ఆ అనుమతి పత్రాన్ని వాహనానికి అతికించాలి. అనుమతి పొందిన వ్యక్తే వాహనం వాడాలి. ఇతరులు వాడితో చర్యలు తీసుకుంటారు. విద్యా సంస్థలు, వాటి మైదానాల్లో ప్రచారం చేయకూడదు. కరపత్రాలపై ముద్రణాలయాల పేరు, చిరునామా కచ్చితంగా ఉండాలి. ప్రచారంలో టోపీలు, కండువాలు ఇవ్వవచ్చు. అయితే వీటిని ఎన్నికల ఖర్చులో చూపించాలి. ధరించే దుస్తులు మాత్రం ఇవ్వకూడదు. దేవుళ్ల ఫొటోలు అభ్యర్థి ఫొటోతో కలిసి డైరీలు, క్యాలెండర్లు ప్రచురించ కూడదు. వాహనాలపై మతపరమైన ఫొటోలు, అభ్యర్థి ఫొటో ఉండకూడదు. ప్రార్థనా స్థలాలకు, పాఠశాలలకు పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల లోపు రాజకీయ పార్టీల కార్యాలయాలు ఉండ కూడదు. రాత్రి 10 గంటల తరువాత, ఉదయం 6 గంటల లోపు మైకులు, లౌడ్‌స్పీకర్లు వాడకూడదు. ఏజెంట్ సంబంధిత పోలింగ్ బూత్ ఓటరై ఉండాలి. ఊరేగింపు మార్గాన్ని ముందుగానే పోలీసులకు తెలియజేయాలి. దిష్టిబొమ్మలు తగల బెట్టకూడదు. ఈ నిబంధనలు పాటించకుంటే ఇబ్బందులు ఎదుర్కొంటారు.

- వలేటివారిపాలెం




## ఓటు వేయకుంటే జైలు, జరిమానా

- పలు దేశాల్లో అమలు
- హక్కు వినియోగం పౌరుల బాధ్యత

ఎన్నికల్లో పౌరులు తమ ఓటును వినియోగించుకోకుంటే, కొన్ని దేశాల్లో జరిమానా విధిస్తారు. మరికొన్ని దేశాల్లో నేరస్థులుగా పరిగణించి శిక్ష కూడా వేస్తారు. ఆస్ట్రేలియాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాల్సిందే. ఓటు వేయని వారికి ఆ దేశ కరెన్సీ ప్రకారం 20 డాలర్ల జరిమానా విధిస్తారు. ఆ మొత్తాన్ని నిర్ణీత గడువులోగా చెల్లించకపోతే 200 డాలర్ల వరకు అదనపు జరిమానా చెల్లించాలి. బెల్జియంలో మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోని వారికి 80 యూరోల వరకు, రెండోసారి ఓటు వేయనివారికి 200 యూరోల వరకు జరిమానా విధిస్తారు. వరుసగా నాలుగుసార్లు ఓటు హక్కు వినియోగించుకోని పక్షంలో పదేళ్ల వరకు జాబితా నుంచి పేరు తొలగిస్తారు. అంతేకాక వీరికి ఉద్యోగావకాశాలు, ప్రభుత్వ పథకాల్లోనూ ప్రాధాన్యం ఇవ్వరు. బ్రెజిల్ దేశంలో ఓటు వేయని వారు ఫైన్ కట్టాలి. గ్రీసు, ఈజిప్టు దేశాల్లో ఓటు వేయని వారిపై ప్రత్యేక విచారణ చేపడతారు. సరైన కారణం చెబితే హెచ్చరించి వదిలేస్తారు. ఎలాంటి కారణం లేకుండా ఓటు వేయలేదని తేలితే జైలుశిక్ష విధిస్తారు. ఇటలీలో ఓటు వేయనివారి పేర్లను అందరికీ తెలిసేలా అధికారిక పత్రాల్లో ప్రచురిస్తారు. పెరూలో ఓటుకు దూరంగా ఉన్నవారి డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేస్తారు. ఇలా.. ఓటు వేయనివారికి ఒక్కో దేశంలో ఒక్కో రకమైన శిక్షలు, జరిమా నాలు ఉన్నాయి. ఏ శిక్షా లేకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశమున్న మన దేశంలో ఓటు వేయకపోవడం భావ్యమా ? ఓటర్లూ బాగా ఆలోచించి సరైన నాయకులను ఎన్నుకోవడం మనందరి కర్తవ్యం.

- పొదలకూరు



## ఆత్మీయత అంతా ఓ నాటకం




అనుబంధం, ఆత్మీయత.. అంతా ఓ నాట కం... అన్నాడో సినీకవి. అనుబంధం సంగతి ఎలా ఉన్నా తాజా ఎన్నికల్లో ఆత్మీయ త మాత్రం ఓ నాటకమేనన్నది తాజా రాజ కీయ సంఘటనలను బట్టి తెలుస్తోంది. ఈ మాటల్లో నిజమెంతో తెలియాలంటే ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ఎత్తుగడలు చూస్తే చాలు. ఓవైపు అభ్యర్థి ఖర్చులపై ఎన్నికల కమి షన్ నిఘా, మరోవైపు పైసలు తీయకపోతే కార్యకర్తలు కరువైపోయే పరిస్థితి. ఇది పోటీలో ఉన్న వారికి మింగుడుపడ డంలేదు. అందుకే తాజాగా నాయకులు ఆత్మీయ సమావేశాలను ఎంచుకుంటున్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకుల దృష్టిలో పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తమతో వస్తున్న కార్యకర్తలందరికీ మద్యం, బిర్యానీ, నగదు ఇచ్చేందుకు పుట్టిన రోజులు, పెళ్లి రోజులు.. అని చెప్పి ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశాల్లో నాయకులు తమకు ఓటు వేయాలని కోరుతున్నారు. అనంతరం కార్యకర్తలకు మద్యం, బిర్యానీ డబ్బులు పంపిణీ చేస్తున్నారు. ఈ ఖర్చులన్నీ ఎన్నికల వ్యయం కింద రాకుండా జాగ్రత్తలు పడుతున్నారు.

- అలగానిపాడు నుంచి అంతర్జాతీయ స్థాయికి..
- నేడు పుచ్చలపల్లి జయంతి

# ఆదర్శ పార్లమెంటేరియన్ సుందరయ్య !

కోవూరు, ఏప్రిల్30 : 'సాటి పార్లమెంటు సభ్యులు కొందరు.. కొత్తరకం కార్లు ఎక్కి రాయంచ నడకతో, మత్తేభయానంతో, ఠీవిపొలుకుతూ, నాయకత్వపు నయగారం తొణికిసలాడుతూ.. పార్లమెంటు భవనంలో వెళ్తుండగా, సైకిలెక్కి పార్లమెంటు భవనం ముందు దిగి, స్టాండులో సైకిల్ పెట్టి, తీగం బిగిసిందో లేదో లాగి చూసుకొని, క్యారియర్‌కు కట్టిన కాయితాల ఫైలు పుచ్చుకొని, లోపలికి ప్రవేశించి తన స్థానంలో కూర్చొని నిష్ఠతో తన పనుల్లో లీనమయ్యే వ్యక్తి శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య.. అని తెలుసుకున్నప్పుడు అపరిచితులకు ఆశ్చర్యం కలుగుతుందేమోగానీ.. పరిచయస్తులకు మాత్రం ప్రతిదిన దృశ్యం' అంటూ 1960లో ఓ తెలుగువార పత్రికలో కథనం ప్రచురితమైంది. ప్రజా పోరాటాల రథసారథిగా, ప్రతిపక్షనాయకుడిగా సుందరయ్య చూపిన మార్గం ఇప్పటికీ ఆదర్శప్రాయం. ఆయన పాదముద్రలు దేశరాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలచిపోయాయి. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆయన్ను ఎందరో స్మరించుకుంటున్నారు. నేడు (మే1న) ఆయన జయంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

### అలగానిపాడు నుంచి ప్రస్థానం

కోవూరు తాలూకా అలగానిపాడులో 1918 మే 1న ధనిక రైతు కుటుంబంలో పుచ్చలపల్లి సుందరయ్య జన్మించారు. బాల్యంలోనే ఆయన వివేకానంద, రామతీర్థల బోధనలకు ఆకర్షితులయ్యారు. గాంధీ పిలుపుతో స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, కొమర రాజు లక్ష్మణరావు లాంటి సాహితీవేత్తల వికాసంతో సాంఘిక చైతన్యాన్ని పెంపొందించుకున్నారు. 14వ ఏటనే మద్రాసు కాంగ్రెస్ మహాసభలో పాల్గొన్నారు. సైమన్ కమిషన్‌ను బహిష్కరిస్తూ జరిగిన ఆందోళనలో పాల్గొన్నారు. 1930లో మద్రాసు లయోలా కాలేజీలో సోదరసమితిని స్థాపించారు. గాంధీజీ పిలుపుతో చదువుకు స్వస్తి పలికి పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో సత్యాగ్రహ శిబిరంలో పాల్గొన్నారు. దళనాయకుడిగా ఎంపికయ్యారు. దీంతో అప్పటి బ్రిటిష ప్రభుత్వం ఆయన్ను అరెస్టు చేసి రెండేళ్ల జైలుశిక్ష విధించింది. బాలుడు కావడంతో సుందరయ్యను తంజావూరులోని బోర్డర్ జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలైన తరువాత అలగానిపాడు నుంచే ఆయన తన రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు.

### వేమన జయంతి నిర్వహణ

రాజకీయ కార్యక్షేత్రంగా అలగానిపాడు నుంచే ఆయన ఓనమాలు దిద్దుకున్నారు. మొట్ట మొదటిసారిగా గ్రామంలో ఆయన వేమన జయంతిని నిర్వహించి, సవర్ణ హిందువులకు, దళితులకు కలిపి సహపంక్తి భోజనం ఏర్పాటుచేశారు. దీంతో ధనిక వర్గాలు ఆయనపై దౌర్జన్యానికి దిగాయి. గ్రామంలో బాలగంగాధర్ తిలక్ గ్రంథాలయాన్ని ఏర్పాటుచేసి యువకుల్లో చైతన్యం కలిగించారు. లాభనష్టాల ప్రమేయం లేకుండా చౌకదుకాణం నిర్వహించి గ్రామస్థుల మన్ననలు పొందారు. అలగానిపాడు వ్యవసాయ కార్మిక సంఘం పేరుతో కూలీల సంఘం ఏర్పాటుచేశారు. ఆ సంఘమే జాతీయ స్థాయి వ్యవసాయ కార్మిక సంఘంగా తరువాత కాలంలో అభివృద్ధి చెందింది. భారత కమ్యూనిస్టు పార్టీని దక్షిణాది రాష్ట్రా ల్లో బలోపేతం చేసేందుకు ఆయన ఎంతో కృషి సాగించారు. పార్టీ విభజనానంతరం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా 14 ఏళ్లపాటు పనిచేశారు. తెలంగాణ విప్లవ పోరాట రథసారథిగా తెలంగాణ సాయుధపోరాటాన్ని తీర్చిదిద్దారు. మొట్ట మొదటి పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్ష నేతగా అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సైతం మెచ్చుకొనేలా ప్రసంగాలు చేశారు.



### తెలుగువారి అభ్యున్నతికి కృషి

నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ధ్యేయంతో పుచ్చలపల్లి సుందరయ్య రచించిన 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' దిక్సూచిగా నిలుస్తోంది. తెలుగు ప్రజల సర్వతోముఖాభివృద్ధికి, జాతీయ సమైక్యతకు పథనిర్దేశం చేసిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య. తెలుగు జాతి వికాసానికి ఆయన రచించిన 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాల్సి ఉంది.

# జన కేతనం



## ఇదీ సందడి

### రోజాపై మరో రోజా పోటీ



నగరి ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ తరఫున రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా పోటీ చేస్తుండగా ఇండిపెండెంట్‌గా అదే పేరుతో మరో అభ్యర్థి కే. రోజా బరిలోకి వచ్చింది. నామినేషన్ల ఘట్టం పూర్తి కావడంతో తిరుపతి రూరల్ పుదిపట్లకు చెందిన కే.రోజా పోటీ చేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించిన లిస్ట్‌లో ఉంది. దీంతో వైసీపీ వర్గాల్లో అయోమయం నెలకొంది. ఈమెకు కుట్టుమిషన్ గుర్తును ఎన్నికల సంఘం కేటాయించింది. ఇద్దరి పేరు ఒకేలా ఉండడంతో వారు తల పట్టుకుంటున్నారు. మరోవైపు టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేరు సరిపోలే విధంగా వైసీపీ నాయకులు భానుప్రకాష్ పేరున్న మరో వ్యక్తితో నామినేషన్ దాఖలు చేయించారు. అది స్క్రూటినీలో తిరస్కారానికి గురికావడంతో వారి ప్లాన్ బెడిసికొట్టింది. అలాగే జ్ఞానప్రకాష్ పేరుతో మరో నామినేషన్ కూడా వేయించారు. ఇది సక్రమంగా ఉండడంతో ఆ అభ్యర్థి ఎన్నికల బరిలో నిలిచారు. టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు ఒకటో నెంబర్ కేటాయించగా జ్ఞాన ప్రకాష్‌కు నాలుగవ నెంబర్ రావడంతో వైసీపీ పాచిక పారలేదనే ప్రచారం జరుగుతోంది. పేర్లతో ఓటర్లను తికమకకు గురిచేయాలనే వైసీపీ ప్రయత్నాలు ఫలించలేదు.

- పుత్తూరు
అర్బన్

తిరుపతి జిల్లా ఎన్నికల బరిలో ఈసారి ప్రధాన పార్టీల తరఫున వారసులు తలపడుతున్నారు. ఏడింటా ఆరు నియోజకవర్గాల నుంచి వీరు పోటీలో నిలిచారు. నలుగురు ఈ అసెంబ్లీ ఎన్నికల నుంచే అరంగేట్రం చేస్తున్నారు. మరో ఇద్దరు మాత్రం రెండోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. తిరుపతి సిటింగ్ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఈ పర్యాయం తాను పోటీ నుంచి తప్పుకొని తనయుడు, నగర డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డికి అవకాశం కల్పించారు. అధికార వైసీపీ నుంచి ఈయన కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుతో తలపడుతున్నారు. తిరుపతి పొరుగు నియోజకవర్గం చంద్రగిరి సిటింగ్ వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఒంగోలు ఎంపీగా పోటీ చేస్తూ ఇక్కడి నుంచి తనయుడు మోహిత్‌రెడ్డిని నిలబెడుతున్నారు. మోహిత్ తొలిసారి వైసీపీ నుంచి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. నగరి నియోజకవర్గం నుంచి దివంగత మాజీ మంత్రి ముద్దు కృష్ణమనాయుడు తనయుడు భానుప్రకాష్ నిలబడుతున్నారు. తన తండ్రి మరణానంతరం 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఈయన వైసీపీ అభ్యర్థి ఆర్కే. రోజా చేతిలో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈసారి కూడా భానుప్రకాష్ వైసీపీ అభ్యర్థి, మంత్రి రోజాను ఢీకొంటున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి వారసుడిగా ఆయన కుమారుడు బొజ్జల సుధీర్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా రెండోసారి తన పాత ప్రత్యర్థి,సిటింగ్ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డితో తలపడుతున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ, ఎమ్మెల్యే అయిన నెలవల సుబ్రహ్మణ్యం కుమార్తె, యువ వైద్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ పోటీ పడుతున్నారు. వెంకటగిరి నుంచి కూడా రాజకీయ వారసుడే వైసీపీ పక్షాన పోటీ చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి కుమారుడు రాంకుమార్ తొలిసారి ఎన్నికల్లో పోటీపడుతున్నారు. ఈ అరుగురు వారసుల్లో ఓటర్లు ఎవరికి పట్టం కట్టి అసెంబ్లీలో తొలి సారి అడుగుపెట్టిస్తారో చూడాల్సిందే.

- తిరుపతి(ఆంధ్రజ్యోతి)

## అసెంబ్లీ బరిలో వార్‌సులు



అభినయ్.. కరుణాకరరెడ్డి
సుధీర్‌రెడ్డి, గోపాలకృష్ణారెడ్డి
మోహిత్‌రెడ్డి, భాస్కరరెడ్డి
విజయశ్రీ, సుబ్రహ్మణ్యం
భానుప్రకాష్, ముద్దు కృష్ణమనాయుడు
రాంకుమార్, జనార్దనరెడ్డి

● వారసుల జోరు



సగం పనులతో ఆగిన ఇండోర్ స్టేడియం నిర్మాణం

### క్రీడాకారుల ఆశలతో ఆటలు

'మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రగిరి ప్రభుత్వ కళాశాలలో క్రికెట్ స్టేడియం ఏర్పాటుచేస్తాం'
గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇచ్చిన హామీ ఇది.


చంద్రగిరిలో క్రికెట్ అభిమానులకు నిరాశే మిగిలింది. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హామీ కార్యరూపం దాల్చకపోవడంతో క్రికెట్ స్టేడియం ఏర్పాటు కలగానే మిగిలింది. 1936లో చంద్రగిరిలో ఏర్పాటైన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 520 మంది చదువుతున్నారు. పక్కనే ఉన్న ఇంటర్ కళాశాలలో మరో 480 మంది చదువుతున్నారు. చంద్రగిరితో పాటు చుట్టుపక్కల గ్రామాల క్రీడాకారులకు సరైన గ్రౌండ్ లేకపోవడంతో ఇతర జిల్లాలపై ఆధారపడుతూ వచ్చారు. ఇక్కడి పాఠశాల పక్కనే ఉన్న మూడున్నరె కరాల గ్రౌండ్‌లో క్రికెట్ స్టేడియం కట్టాలని స్థానిక యువత ఎప్పటి నుంచో విజ్ఞప్తి చేస్తూ వస్తోంది.ఈక్రమంలో యువత ఓట్లకు గాలం వేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సంకల్పించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని మాటిచ్చారు. అధికారంలో ఉన్న ఈ ఐదేళ్లలో కనీసం ఆవైపు చూసిన సందర్భాలు కూడా లేవు.

### నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణం

పాఠశాల వెనుకభాగంలోని రెండున్నర ఎకరాలలో గత టీడీపీ ప్రభుత్వం మొదలుపెట్టిన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు కూడా నిలిచిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలంలో ఎన్టీఆర్ క్రీడావికాస కేంద్రాల పేరుతో ఓ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని నాటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా 2018లో చంద్రగిరి ప్రభుత్వ పాఠశాల, కళాశాలకు రూ.1.8 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను ప్రారంభించింది. స్టేడియంలో 2 బాడ్మింటన్ కోర్టులు, కోచ్‌రూం, జిమ్‌రూం, టాయిలెట్స్, డార్మిటరీలకు ప్లాన్ సిద్ధం చేశారు. ఇక టోర్నమెంట్లకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని చంద్రగిరి క్రీడాకారులతో పాటు పాకాల, ఎర్రవారిపాలెం, చిన్నగొట్టిగల్లు, రామచంద్రాపురం, తిరుపతిరూరల్ యువత సంబరపడ్డారు. ఇంతలో వైసీపీ ప్రభుత్వం వచ్చింది. నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం వహించింది. సంబంధిత కాంట్రాక్టర్ అప్పటికే రూ.కోటితో దాదాపు సగం పనులు పూర్తిచేశారు. నిధుల విషయంలో కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చింది. పనులను మధ్యలో వదిలేశారు. దీంతో ఇండోర్ స్టేడియం కూడా ఏర్పాటు కాలేదని క్రీడాకారులు వాపోతున్నారు.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

గత ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎడాపెడా హామీలిచ్చేశారు. విజయమే లక్ష్యంగా సాధ్యాసాధ్యాలను పట్టించుకోకుండా అడగనోడిదే పాపం అన్నట్టుగా మాటిచ్చేశారు. అధికార పార్టీ తరఫున గెలిచారు కాబట్టి తమ ఎమ్మెల్యే ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతారని నియోజకవర్గ ప్రజలు నమ్మారు. గెలిచాక ప్రజలకిచ్చిన హామీలను పక్కన పెట్టేశారు. అయిదేళ్లూ ఏ మాటా నిలబెట్టుకోకుండానే గడిపేశారు. దీంతో ఎమ్మెల్యేపై ఇక్కడి ప్రజానీకం ఆగ్రహంతో ఉంది. అమలు చేయని హామీలలో ఇవికొన్ని...




# చెవిరెడ్డి పువ్వులు

### కందకమూ.. ఎక్కడా ?

**●రైతన్నలకు తప్పని ఏనుగుల బెడద**



ఏనుగుల సంచారంతో నాశనమైన మామిడి చెట్లు


వ్యవసాయ భూములను ఏనుగులు ధ్వంసం చేయకుండా కందకాలు ఏర్పాటు చేస్తామన్న హామీ నెరవేరలేదు. రైతులకు ఏనుగుల తలనొప్పి ఇప్పటికీ తగ్గలేదు. అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే చెవిరెడ్డి కందకాల మాటే ఎత్తలేదంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, రేణిగుంట సమీపంలోని మండల్లోని పంచాయితీలు చాలా వరకు శేషాచల అడవులకు సమీపంలో ఉన్నాయి. దాదాపు 15 వేల ఎకరాలకుపైగానే పొలాలు అడవికి దగ్గరగా ఉన్నాయి. సమీపంలోని గ్రామ రైతులు మామిడి, వరి, టమోట, కొబ్బరిచెట్లు పెంపకంపై ఆధారపడుతుంటారు. అడవికి సమీపంలో పొలాల్లో నిత్యం ఏనుగులు గుంపు సంచరిస్తుండటంతో పంటలు నాశనమవుతున్నాయి. పంట నష్టంతో పాటు ప్రాణనష్టం, ఏనుగుల దాడిలో గాయపడిన వారి సంఖ్య కూడా అధికమే. దాదాపు 20 నుంచి 25 ఏళ్ల పాటు పెంచిన మామిడిచెట్లను కూడా భారీగా నష్టపోయిన సందర్భాలున్నాయి. తమ సమస్యను పరిష్కరించాలంటూ ఏన్నోఏళ్లుగా రైతులు ప్రభుత్వానికి విన్నవించుకుంటూనే ఉన్నారు. ఈక్రమంలో గతంలో పాదయాత్ర సందర్భంగా జగన్‌తో పాటు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కందకాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చెవిరెడ్డి అటుగా వెళ్లి చూడటం కానీ, కనీసం ఈ అంశంపై చర్చించిన పాపాన పోలేదని రైతులు విమర్శిస్తున్నారు

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

### మురుగులో కొట్టుకుపోయిన హామీ

చంద్రగిరికి భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు హామీకే పరిమితమయ్యింది. తాను మళ్లీ గెలిచిన వెంటనే చంద్రగిరి మేజర్ పంచాయతీకి అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్‌ను ఏర్పాటు చేస్తానని గత ఎన్నికల సమయంలో వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇచ్చిన హామీ అటకెక్కింది. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఈఅంశంపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. చంద్రగిరి పంచాయతీలో దాదాపు 26 వేల జనాభా నివసిస్తున్నారు. సరైన డ్రైనేజ్ వ్యవస్థ లేక మురుగునీటి సమస్య ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. స్థానికుల ఇళ్ల వద్ద, కాలనీల్లో ఏర్పాటు చేసుకున్న కాలువల ద్వారా డ్రైనేజ్ నీరు ప్రవహిస్తోంది. కొన్ని చోట్ల చెట్లు, రాళ్లు, మట్టిపెళ్లలతో ఈడ్రైనేజ్ నీరు ముందుకు వెళ్లలేక నిలిచిపోతోంది. కాలువలను శుభ్రపరిచిన సందర్భాల్లో మురుగు వెంకటంపేట, నాకలగుంట వంటి ప్రాంతాలో ఆగిపోతోంది. వర్షం కురిస్తే మురుగు వర్షపునీటితో కలిసిపోయి ఇళ్లమధ్యలోనే ప్రవహిస్తోంది. 2019 ఎన్నికల సమయంలో చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సందర్శించి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విజయనగర్ కాలనీలో భూగర్భడ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈవిషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనను మళ్లీ గెలిపిస్తే విజయనగర్ కాలనీ మాత్రమే కాకుండా చంద్రగిరి మేజర్ పంచాయతీ మొత్తానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్‌ను ఏర్పాటు చేస్తామని ప్రజలను నమ్మించారు. అధికారంలోకి వచ్చిన చెవిరెడ్డి ఆ తర్వాత ఆ మాటే ఎత్తలేదు. పలుమార్లు స్థానిక ప్రజలు డ్రైనేజ్ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళితే 'చూస్తాం, చేస్తాం' అనే మాటలకే పరిమితమయ్యారు.

- తిరుపతి
(ఆంధ్రజ్యోతి)



రాయలచెరువు...

### చెరువుకట్ట దాటని మాట

● మరమ్మతులకు నోచుకోని రాయలచెరువు

జిల్లాలో అతిపెద్దదైన రాయలచెరువు కట్ట అభివృద్ధి చేస్తానన్న ఎమ్మెల్యే మాట నీటిమూటే అయిందంటున్నారు ఇక్కడి ప్రజానీకం. 2021 నవంబరులో భారీ వర్షాలకు చెరువు కట్ట కొంతమేర కుంగింది. చెరువు తెగుతుందేమోనని కట్టకింద ఉన్న 20 గ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేత పట్టుకుని తలో దిక్కు పారిపోయారు. నాటి జల ప్రళయానికి సుమారు 17 రోజుల పాటు ప్రజలు ఆర్‌సీపురం మండల కేంద్రానికి చేరుకోలేకపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి కట్టకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి మమ అనిపించారు. ఇలాంటి పరిస్థితి మరోసారి ఎదురు కాకుండా రాయలచెరువు కట్టను రూ.8 కోట్లతో పటిష్ట పరచి ప్రజల ఇబ్బందులను తొలగిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి కూడా నిధులు కోసం ప్రతిపాదనలు పంపారు. మూడేళ్లు గడుస్తున్నా ఆ ఊసే లేదు. చెరువు కట్టను పూర్తిగా ముళ్లపొదలు కమ్మేశాయి. రాయలచెరువు ఒకసారి నిండితే ఐదేళ్ల పాటు ఆర్‌సీపురం మండల ప్రజలకు సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఇలాంటి చెరువును తమ ఎమ్మెల్యే పట్టించుకోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.


- రామచంద్రాపురం



వెంకటంపేటలో అస్తవ్యస్థంగా ఉన్న డ్రైనేజ్ కాలువలు



సూళ్లూరుపేట చరిత్ర



## విశిష్టతల కోట

ఆసియాలోనే అతిపెద్ద పులికాట్ ఉప్పునీటి సరస్సు.. అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనాకేంద్రం షార్.. దేశవిదేశాలకు చెందిన పక్షుల విడిది నేలపట్టు ..పేరెన్నికగన్న పరిశ్రమలు కొలువుదీరిన శ్రీసిటీ సెజ్...ఇలా ఎన్నో విశేషాల సమాహారం సూళ్లూరుపేట నియోజకవర్గం. 13 సార్లు నియోజకవర్గంలో ఎన్నికలు జరగగా, కాంగ్రెస్, టీడీపీలు చెరో ఐదేసిసార్లు విజయం సాధించాయి. వైసీపీ రెండుసార్లు గెలిచింది. ఈ నియోజకవర్గం ఏర్పడ్డాక మహిళలెవరూ ప్రాతినిధ్యం వహించలేదు. రెండుసార్లు పోటీ చేసినా గెలవలేదు. పసల పెంచలయ్య, పరసా వెంకటరత్నంలు మాత్రమే మంత్రులుగా పనిచేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండే ఈ నియోజకవర్గంలో టీడీపీ ఆవిర్భావం తరువాత పరిస్థితి మారిపోయింది. టీడీపీ ఆధిపత్యం సాగింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో మొదటి ఎన్నికల్లో ప్రస్తుత సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాలు వెంకటగిరి నియోజకవర్గంలో కలసి ఉండేవి. 1962 నియోజకవర్గాల పునర్ విభజనతో సూళ్లూరుపేట విడిగా నియోజకవర్గంగా ఏర్పడింది.

-తడ

**నియోజకవర్గం ఏర్పడింది: 1962**
**ఎన్నిసార్లు ఎన్నిక జరిగింది: 13**
**నియోజకవర్గం పరిధిలోని మండలాలు :**
సూళ్లూరుపేట, నాయుడుపేట, తడ, దొరవారిసత్రం, పెళ్లకూరు,ఓజిలి

### ఎమ్మెల్యేలు

| | | |
|---|---|---|
| 1962 | పసుపులేటి సిద్దయ్యనాయుడు | కాంగ్రెస్ |
| 1967 | పిట్ల వెంకటసుబ్బయ్య | ఇండిపెండెంట్ |
| 1972 | పిట్ల వెంకటసుబ్బయ్య | కాంగ్రెస్ |
| 1978 | పిట్ల వెంకటసుబ్బయ్య | కాంగ్రెస్ |
| 1983 | సట్టి ప్రకాశం | టీడీపీ |
| 1985 | మదనంబేటి మణెయ్య | టీడీపీ |
| 1989 | పసల పెంచలయ్య | కాంగ్రెస్ |
| 1994 | పరసా వెంకటరత్నం | టీడీపీ |
| 1999 | పరసా వెంకటరత్నం | టీడీపీ |
| 2004 | నెలవల సుబ్రహ్మణ్యం | కాంగ్రెస్ |
| 2009 | పరసా వెంకటరత్నం | టీడీపీ |
| 2014 | కిలివేటి సంజీవయ్య | వైసీపీ |
| 2019 | కిలివేటి సంజీవయ్య | వైసీపీ |

**ఓటర్లు**
మొత్తం : 2,41,124
పురుషులు: 1,17,367
మహిళలు 1,23,733
ఇతరులు : 24

## రాష్ట్రం కోసం రాజకీయ ప్రచారం

**శ్రీకాళహస్తిలో సందడి చేస్తున్న పల్లమాల సుధాకర్**



'మొగలిరేకులు', 'చక్రవాకం' అనే పేర్లు వినగానే పల్లమాల సుధాకర్, మంజులా నాయుడు గుర్తుకువస్తారు. తెలుగు టీవీ సీరియల్స్‌లో ట్రెండ్ సెట్టర్స్‌గా ఈ దంపతులకు ప్రత్యేక స్థానం ఉంది. పాపానాయుడుపేటలోనే మొగిలిరేకులు కి శ్రీకారం చుట్టారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన పల్లమాల సుధాకర్ కొద్ది రోజులుగా ప్రచారంలో కనిపిస్తున్నారు. టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి విజయం కోసం తమ బంధుమిత్రులందరినీ సమీకరిస్తున్నారు. ప్రతి రోజూ వివిధ వర్గాలతో మంతనాల్లో బిజీగా ఉంటున్నారు. హైదరాబాద్‌లో స్థిరపడిన వీరు మొత్తం కుటుంబం అంతా ఎన్నికల కోసమే 20 రోజుల కిందట శ్రీకాళహస్తికి వచ్చేశారు. ఎందుకిలా అనడిగితే పల్లమాల సుధాకర్ ఇలా చెబుతున్నారు.. "ప్రస్తుతం రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిణామాలు ఎంతో బాధ కలిగించాయి. విలువలు గాడి తప్పాయి. అభివృద్ధి కనుమరుగైపోయింది. భావితరాల భవిష్యత్తుపై అంధకారం అలముకుంది.. కొత్తగా వచ్చే భూచట్టం పేరు వింటేనే రైతులు వణికి పోతున్నారు. ఇలాంటి దారుణ పరిస్థితులపై సామాజిక స్పృహతో స్పందించాలనిపించింది. రామాయణంలో ఉడుత సహాయం గుర్తుకు వచ్చింది. సమాజంలో మంచిని బతికించుకోవడం కోసమే ఈ ప్రయత్నం చేస్తున్నాను. పవన్‌కళ్యాణ్ ఆశయాలు నన్ను బాగా ఆకట్టుకున్నాయి. రాష్ట్రం తిరిగి గాడిలోపడాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. శ్రీకాళహస్తి ప్రాంతానికి దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఎంతో సేవ చేశారు. ఆయన కుమారుడి విజయం కోసం పనిచేసి గోపాలన్న రుణం తీర్చుకోవాలనుకున్నాను. ఈ ప్రాంతంలో నా ఆత్మీయులు అసంఖ్యాకంగా ఉన్నారు. వారందరినీ చైతన్యపరుస్తున్నాను." పల్లమాల సుధాకర్ 2009లో శ్రీకాళహస్తి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశారు కూడా. ప్రజారాజ్యం లోనూ చురుగ్గా వ్యవహరించారు.


- శ్రీకాళహస్తి

## ఓటును అమ్ముకోవద్దు


పోస్టర్ల ఆవిష్కరణలో డీఎస్పీ తదితరులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 30: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద జై భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఓటును అమ్ముకోవద్దు అంటూ అవగాహన కల్పించే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకున్నప్పుడే దేశం అభివృద్ధిపథంలో పయనిస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు జైభారత్ సంస్థ చేస్తున్న ఈ అవగాహన కార్యక్రమం అభినందనీయమన్నారు. ఓటర్లు నగదు, మద్యం ఇతర ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా ఓటును వినియోగించుకోవాలన్నారు. సంస్థ ప్రతినిధులు లోకనాథ్, శ్యామ్‌సుందర్, నాగరాజు, ఉమా తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నాయకుడి మృతి


బలరామనాయుడు (ఫైల్‌ఫొటో)

దొరవారిసత్రం, ఏప్రిల్ 30: మండలంలోని పూలతోట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వంకాయలపాటి బలరామనాయుడు(89) మృతి చెందారు. గత కొంతకాలంగా చెన్నైలోని ఓ వైద్యశాలలో చికిత్సలు పొందుతున్న ఆయన సోమవారం రాత్రి తుది శ్వాస విడిచారు. గ్రామంలో పేదలకు ఇంటి వద్దే ఉచిత ప్రథమ చికిత్సలు అందించే వారు. పరిసర ప్రాంతాల ప్రజలకు ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చినప్పుడు చెన్నై, తిరుపతి వంటి నగరాల్లోని వైద్యశాలలకు తీసుకెళ్లి వైద్య సాయం అందించేవారు. అలాగే పూలతోట పంచాయతీతో పాటు ఆనేపూడి, కొత్తపల్లి, సింగనాలత్తూరుల్లో టీడీపీని బలోపేతం చేశారు. ఆయన మృతితో పరిసర ప్రాంతాల్లో ప్రజలు విచారం వ్యక్తం చేశారు. ఆయన పార్థివదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. బలరామనాయుడి పార్థివదేహానికి మండలంలోని పలువురు టీడీపీ నాయకులతో పాటు వైసీపీ నాయకులు నివాళి అర్పించారు. మాజీ మంత్రి పరసారత్నం, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ చైర్మన్ డి.బాలచంద్రారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, మునస్వామినాయుడు, ఓడూరు రమణారెడ్డి తదితరులు నివాళి అర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## వాహన తనిఖీలు ముమ్మరం



వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 30: పట్టణంలోని వల్లివేడు క్రాస్ పాయింట్ వద్ద వాహన తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. బాలాయపల్లి మండలం నిడిగల్లు అటవీ ప్రాంతంలో ఖాళీ కంటైనర్ వెలుగు చూడడంతో తనిఖీలు ముమ్మరం చేసినట్టు చెక్‌పాయింట్ అధికారి హరిప్రియ చెప్పారు. కార్లకు మాత్రమే పరిమితంగా కాకుండా ఆర్టీసీ బస్సులు, లారీలు, ట్రాన్స్‌పోర్టు, ప్రచారం వాహనాలనుసైతం ముమ్మరంగా తనిఖీ చేశారు.

## వెంకన్నపాళెంలో వైద్యశిబిరం

కోట, ఏప్రిల్ 30: మండల పరిధిలోని వెంకన్నపాళెంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో శంకరయ్య ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో వెంకన్నపాళెంతోపాటు వీరారెడ్డిసత్రం, తిన్నెలపూడి గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆయా రోగులకు మందులను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి అల్లాబక్ష్, పలువురు వైద్యాధికారులు, ఏఎన్ఎంలు ఉన్నారు.

## నేటినుంచి పింఛన్ల పంపిణీ

కోట, ఏప్రిల్ 30: మండలంలో నేటినుంచి డీబీటీ ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీవో శంకరయ్య తెలిపారు. 21 పంచాయతీల్లో 7,179మంది పింఛన్‌దారుల్లో 5,620 మందికి డీబీటీ ద్వారా వారి ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. 1559 మందికి సచివాలయా ఉద్యోగుల నేరుగా ఇళ్లకు అందిస్తారన్నారు.

## కూటమి అధికారంలోకి వస్తేనే యువతకు ఉద్యోగాలు: కురుగొండ్ల లక్ష్మి


డి.ఉప్పరపల్లి ఎన్నికల ప్రచారంలో లక్ష్మీసాయి ప్రియ

డక్కిలి, ఏప్రిల్ 30: కూటమి అధికారంలోకి వస్తేనే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తాయని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీసాయిప్రియ అన్నారు. మంగళవారం ఆమె డక్కిలి మండలంలోని మోఫూరు, దందవోలు, డి.ఉప్పరపల్లి, గొల్లపల్లి, మాటుమడుగు, శ్రీపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తన తండ్రి రామకృష్ణను గెలిపిస్తే తామిద్దరం కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న సీఎం జగన్ ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో అక్రమంగా సంపాదించుకున్న డబ్బును గుమ్మరిస్తున్నారని, ఆ నోట్లకు మరోసారి మోసపోవద్దని హితవు పలికారు. పి.కోటేశ్వరరెడ్డి, ఏ.రామచంద్రయ్య నాయుడు, ఏ.శ్రీరాములు, ఏ.ఎం.రత్నం, డి.వెంకటేశ్వర్లు, సిద్దయ్య, వంశీ, భాస్కర్, శ్రీనివాసులు, చెలికం భాస్కరరెడ్డి, పి.పి.చౌదిరి, జనార్దన రెడ్డి, మస్తాన్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, రామ్మూర్తి, సాయి, రాయి మస్తాన్‌నాయుడు తదితరులు వున్నారు.

## ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించుకుందాం

చిట్టమూరు, ఏప్రిల్ 30 : మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని బీజేపీ, జనసేన నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి, గూడూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి టి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బురదగాలికొత్తపాళెం, అరవపాళెంలలో ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు, ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

## టీడీపీతోనే మహిళా సంక్షేమం



సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుమహిళ నాయకురాలు శ్రావణిరెడ్డి

కోట, ఏప్రిల్ 30: మహిళలకు సంక్షేమంతోపాటు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఒక్క టీడీపీకే దక్కిందని తెలుగుమహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి చెప్పారు. కోట పట్టణ పరిధిలోని నార్త్ గిరిజనకాలనీలో మంగళవారం జరిగిన ఆత్మీయ సదస్సులో ఆమె మాట్లాడుతూ... ప్రతి మహిళా నిర్భయంగా తిరిగేందుకు అవకాశం కల్పించింది మాజీ సీఎం చంద్రబాబే అన్నారు. డ్వాక్రా సంఘాలు పెట్టి ప్రతి మహిళా తనకాళ్లపై తాను నిలబడి కుటుంబపోషణ చేసుకునేందుకు అవకాశం కల్పించింది ఎన్టీఆర్, చంద్రబాబులే అన్నారు. సీఎం జగన్ మహిళలను అన్ని రంగాల్లో మోసగించారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌కు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని చంద్రబాబు సీఎం అయితేనే గాడిలో పెట్టగలరన్నారు. అదే విధంగా ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి బాటలు వేసుకుందామన్నారు. తెలుగుమహిళలు గుండాల లీలావతి, గీతావాణి, పోలమ్మ, సుహాసిని, టీడీపీ నేతలు టి.సురేష్‌బాబు, డి.సురేష్, జలీల్‌అహ్మద్, టి.రాధా కృష్ణారెడ్డి, ఎం.అనిల్, పోలయ్య తదితరులు ఉన్నారు.

### టీడీపీలో పలువురి చేరిక

**సూళ్లూరుపేట**: మండల పరిధిలోని కోటపోలూరు, సుగ్గుపల్లికి చెందిన వైసీపీ నాయకులు పలువురు టీడీపీలో చేరారు. మంగళవారం టీడీపీ నాయకురాలు ఇసనాక వాణి ఆధ్వర్యంలో రెండు గ్రామాల నుంచి 50 మంది వైసీపీ కార్యకర్తలు ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ ఇంటి వద్ద టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొమ్మన్ పళణి తదితరులు పాల్గొన్నారు.

## పదేళ్లలో చేసిన ఒక్క పనైనా చెప్పగలవా?

● ఎమ్మెల్యే కిలివేటిని ప్రశ్నించిన బీజేపీ నేత వాకాటి



రోడ్ షోలో మాట్లాడుతున్న బీజేపీ నేత వాకాటి నారాయణరెడ్డి - టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

పెళ్లకూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, ఏప్రిల్ 30: సూళ్లూరుపేట నియోజకవర్గంలో తమ హయాంలో జరిగిన అభివృద్ధిని చూపించగలమని, పదేళ్లు ఎమ్మెల్యేగా ఏమి అభివృద్ధి చేశారో చెప్పగలిగే దమ్ము కిలివేటి సంజీవయ్యకు ఉందా అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి ప్రశ్నించారు. సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరసారత్నం, ఉమ్మడి నెల్లూరు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు రంగినేని కృష్ణయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.నరేంద్రరెడ్డితో కలసి చెంబడిపాలెం, దిరసనమాల, కప్పగుంటకండ్రిగ, పాలచ్చూరుల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకాటి మాట్లాడుతూ... కూటమి అభ్యర్థులైన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయశ్రీ, ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి తిరోగమనం పట్టిందన్నారు. అనంతరం నెలవల మాట్లాడుతూ... ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ పోలీసులను అడ్డం పెట్టుకుని రాక్షస పాలన సాగించారని దుయ్యబట్టారు. ప్రచారానికి వస్తున్న వైసీపీ నాయకులను అభివృద్ధిపై నిలదీయాలని పిలుపునిచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నాయకులు పేరం రమేష్‌నాయుడు, మధునాయుడు. పి.తిరుమలనాయుడు, పి.రాజ గో పాల్‌రెడ్డి, శివకుమార్, ప్రసాద్‌నాయుడు, సతీష్‌చంద్ర, మాల్యాద్రి నాయుడు, చంద్రారెడ్డి, దార్ల రాజేంద్ర, పరసారాజ, బల్లితిరుపాల్ ఉన్నారు.

### చంద్రబాబుతోనే స్వర్ణాంధ్ర: విజయశ్రీ

వైసీపీ పాలనలో తిరోగమనం పట్టిన రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం అయితేనే సాధ్యమని విజయశ్రీ అన్నారు. మండలంలోని శిరసనంబేడు, చావాలి పంచాయతీల్లో నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డితో కలసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. దిగువ చావాలిలో వైసీపీ నాయకులు శ్రీపతి రవి, చంద్రయ్య, డి.భగవాన్‌దాస్ తదితరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పి టీడీపీకి ఓటు వేసి పట్టం కట్టాలని కోరారు. వేలూరు కల్యాణ్‌రెడ్డి, హరిబాబురెడ్డి, సర్పంచు గుంటపూడి, నేలవల్లి సిద్యులయ్యనాయుడు, సురేష్‌నాయుడు, పెంచలయ్య, రమణయ్య.

### నాయుడుపేట, సూళ్లూరుపేటల్లో చేరికలు



నాయుడుపేటలో నెలవల రాజేష్ నాయకత్వంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ 786 రఫి సహ వందమంది టీడీపీలో చేరారు. సూళ్లూరుపేట మండలం కోటపోలూరు, సుగ్గుపల్లి గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీ నాయకురాలు ఇసనాక శ్రీవాణి, తిరుమూరు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.

## ఎంపీగా గెలిస్తే సముద్ర ముఖద్వారాల పూడిక తీయిస్తా

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావు



గూడూరులో జరిగి సమావేశంలో వరప్రసాదరావు తదితరులు - అక్కంపేటలో బీజేపీ నాయకులతో వరప్రసాద రావు భేటీ

గూడూరు, ఏప్రిల్ 30: తాను ఎంపీగా గెలిస్తే ఏడాదిలోగా సముద్ర ముఖద్వారాల పూడిక తీయిస్తానని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు హామీ ఇచ్చారు. మంగళవారం పట్టణంలోని సనత్ నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్ర పర్యావరణ ఆంక్షలు సడలించి నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తానన్నారు. అమృత్ నిధులు తీసుకొచ్చి మున్సిపాల్టీలో అభివృద్ధి పనులు చేపడుతానన్నారు. కోతకు గురయ్యే ప్రాంతాలు సహా కండలేరుకు కాంక్రీట్ రివిట్‌మెంట్, గూడూరు చెరువు అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయిస్తామన్నారు. నియంతలా వ్యవహరిస్తున్న సీఎం జగన్‌కు పరిపాలించే అర్హత లేదన్నారు. జగన్‌కు అహంకారం పెరిగిపోయిందని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. ఆయనే స్వయంగా సిలికా, క్వార్ట్జ్, మద్యం వంటి అక్రమ వ్యాపారాలు సాగిస్తూ కోట్ల రూపాయలను కొల్లగొట్టారన్నారు. నిరంకుశ వైసీపీని ఓడించేందుకు బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా ఏర్పడిందన్నారు. రానున్న ఎన్నికలో కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. అనంతరం విశ్రాంత బ్యాంకు మేనేజర్ నరసప్పను బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో చంద్రప్ప, పి.పురుషోత్తంరెడ్డి, గిరిరెడ్డి, కోటారెడ్డి, పి.కోటేశ్వరరావు, ఎ.బాలకృష్ణమనాయుడు, వై.వెంకటసుబ్బయ్య, మన్నెం శీనయ్య, వల్లూరు మోహన్, వినీష్, దిలీప్, బిందురెడ్డి, మనోజ్‌కుమార్, లక్ష్మీ, జీనత్, భవానీ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### నరేంద్రమోదీ పాలనలో అభివృద్ధిపథంలో భారతదేశం....

**మనుబోలు**: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో మనదేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని వరప్రసాదరావు అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గం మనుబోలు మండలం అక్కంపేటలో బీజేపీ నాయకుడు కృష్ణారెడ్డి నివాసంలో ఎన్డీఏ కూటమి నాయకులతో సమావేశమయ్యారు. ప్రపంచ దేశాల్లో ఎక్కడికెళ్లినా భారతదేశం పేరు చెప్పగానే మోదీని ప్రస్తావిస్తున్నారన్నారు. గాడి తప్పిన ఏపీ అభివృద్ధి చెందాలంటే అనుభవం కలిగిన చంద్రబాబు సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రవీంద్రరెడ్డి, సురేంద్రరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు

## ఉపాధి పనులు కల్పించండి


గ్రామస్తులతో ఎంపీడీవో

కోట, ఏప్రిల్ 30: ప్రస్తుత సీజన్‌లో కూలి పనులు లేక ఇబ్బందుల్లో ఉన్నామని ఉపాధి హామి పథకంలో పనులు కల్పిస్తే కుటుంబాలను పోషించుకుంటామని కోట దళితవాడ మహిళలు ఎంపీడీవో శంకరయ్యకు వినతి చేశారు. కోట మేజర్ పంచాయతీ పరిధి దళితవాడ, పల్లగుంటలకు చెందిన తమకు ఉపాధి హామీ పనులు కల్పించలేదన్నారు. స్పందించిన ఎంపీడీవో శంకరయ్య పనులు కల్పించేందుకు క్షేత్రసహాయకులను పురమాయించాలని ఏపీవో పూర్ణిమను ఆదేశించారు.

## చంద్రబాబుతోనే సుపరిపాలన


యాచవరంలో టీడీపీ ప్రచారం

బాలాయపల్లి, ఏప్రిల్ 30: రాష్ట్రంలో సుపరిపాలన టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని ఆ పార్టీ బాలాయపల్లి మండల అధ్యక్షుడు మస్తాన్‌నాయుడు అన్నారు. మండలంలోని యాచవరం, రామాపురంలలో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ, బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావును గెలిపించాలని కోరారు. వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, రాయి సత్యంనాయుడు, కె.శ్రీహరి, సి.సి.నాయుడు, కొర్రపాటి రామచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీకి ఓటమి భయం పట్టుకుంది: కురుగొండ్ల



రామకృష్ణకు గజమాలతో సత్కారం - సైకిల్ గుర్తు చూపుతున్న కురుగొండ్ల

వెంకటగిరి, డక్కిలి, ఏప్రిల్ 30: వెంకటగిరి వైసీపీ నేతలకు ఓటమి భయం పట్టుకుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన పాళెంకోట, మొక్కలపాడు, దాచెరువు, పాలకొండ సత్రం, లాలాపేట, సోమసానిగుంట, అరవపాళెంలలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఓటమి భయం పట్టుకునే ప్రచారానికి సీఎం జగన్‌ను వెంకటగిరికి పిలిపించుకున్నారని ఎద్దేవా చేశారు. సీఎం సభ వెలవెలబోవడంతో ఆ పార్టీ శ్రేణులు నిరుత్సాహంతో టీడీపీ నేతకు టచ్‌లోకి వస్తున్నారన్నారు. సీఎం జగన్ దొడ్డి దారిన అధికారం పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలనే ఇక్కడి నేతలు కూడా అనుసరిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా టీడీపీలో చేరినా, ఆ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు డబ్బును ఎరగా వేస్తున్నారని విమర్శించారు. వెంకటగిరి నేతలు డబ్బుకు అమ్ముడు పోయేవారు కాదని అధికార పార్టీ నేతలు తెలుసుకుంటే మంచిదన్నారు. అరచేతితో సూర్యుడిని ఆపడం ఎంత కష్టమో వెంకటగిరి టీడీపీ విజయాన్ని అడ్డుకోవడం కూడా అంతే కష్టమన్నారు. స్థానికేతరుడికి ఓటు వేస్తే ఆయన ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియక ప్రజలు ఇబ్బంది పడతారని చెప్పారు. వెంకటగిరి ప్రజల మీద నమ్మకం లేకే వైసీపీ అభ్యర్థి తన సభలకు, నామినేషన్‌కు, సీఎం సభకు కోట, వాకాడు, చిట్టమూరు, గూడూరు మండలాల నుంచి జనాన్ని డబ్బిచ్చి తరలించారన్నారు. ఓటర్లను కూడా అక్కడి నుంచే తీసుకు వస్తారేమోనని ఇక్కడి ప్రజల్లో అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఇక కూటమి విజయం సాధిస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని లేదంటే అందరూ ఎక్క రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దయనీయ పరిస్థితులు నెలకొంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా రామకృష్ణ ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఆయన వెంట ప్రచారంలో టీడీపీ రూరల్ అధ్యక్షుడు పప్పు చంద్రమౌళిరెడ్డి, నాయకులు చాట్ల రాజా, మునిరత్నం, గోపాల్, సూరీ, గొల్లగుంట మురళీ, వెంకటముని, నారా శేఖర్, ముద్దా మురళి, తోట రామచంద్రయ్య, స్వప్న, నక్కల వెంకటేశ్వర్లు, పి.ఎం.శివనారాయణ, బి.నరసింహులు, సుధాకర్, ధనశేఖరు, బీజేపీ నాయకులు శ్రావణ్‌కుమార్, శివకోటి, జనసేన పార్టీ నాయకులు జి.వెంకటేశ్వర్లు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీపురంలో తాతను గెలిపించాలంటూ ప్రచారం చేసున్న యామి

## ప్రజలకు రక్షణగా కూటమి మేనిఫెస్టో: పాశిం



పోటుపాళెంలో జరిగిన గిరిజన మహిళల ముఖాముఖిలో పాశిం సునీల్‌కుమార్ - చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెంలో ప్రచారం చేస్తున్న సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 30: కూటమి ప్రకటించిన మేనిఫెస్టో రాష్ట్ర ప్రజలకు రక్షణగా, భావితరాల భవిష్యత్తుకు గ్యారెంటీగా నిలుస్తోందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని పోటుపాళెంలో ఇంటింటా ప్రచారం జరిపి గిరిజనకాలనీలో గిరిజన మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో హైలెవెల్ వంతెన నిర్మించినట్టు వారికి గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమాన్ని మిళితం చేసి ఉమ్మడి కూటమి మేనిఫెస్టోను రూపొందించిందన్నారు. ఉమ్మడి కూటమి అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు భవిష్యత్తు ఉంటుందన్నారు. వైసీపీ ప్రభుత్వం రూ.13లక్షల కోట్లు అప్పుచేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దివాలా తీయించిందన్నారు. రూ.10 ఇచ్చి రూ.100 కొట్టేస్తూ నవమోసాలు చేసిందన్నారు. అన్నక్యాంటీన్లు, నిరుద్యోగభృతి సహా వందకుపైగా టీడీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ఉమ్మడి కూటమి పనిచేస్తుందన్నారు. ఎస్.భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, డి.రాఘవరెడ్డి, వి.శివకుమార్, ప్రకాష్‌నాయుడు, వి.హరి, సుధాకర్‌రెడ్డి, నరేష్, చంద్రమౌళి, బాబు, నరసింహులు, దాము, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీని గద్దెదించే సమయం ఆసన్నమైంది....

చిల్లకూరు: రాష్ట్రంలో విధ్వంసపాలన సాగిస్తున్న వైసీపీని గద్దెదించే సమయం ఆసన్నమైందని రానున్న ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం తిప్పగుంటపాళెం, తొణుమాలల్లో ఉమ్మడి మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, జి.లీలావతి, శ్రీనివాసులురెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సురేంద్రరెడ్డి, శైలజ, కీరవాణి, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కృష్ణాపురం గిరిజనకాలనీలో తానంకి నానాజీ ఆధ్వర్యంలో పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టాభిరామిరెడ్డి, బాబు, రామచంద్రారెడ్డి, రాంప్రసాద్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.


చిల్లకూరులో ప్రచారం నిర్వహిస్తున్న సంధ్యారాణి